ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 16 జూలై 2024

కృతజ్ఞతా యాత్ర



రాజధాని అమరావతిని నిలబెట్టే నాయకుడిని రాష్ట్ర ప్రజలు ఎన్నుకున్నారని అమరావతి రైతులు సంతోషం వ్యక్తం చేశారు.అమరావతికి చెందిన పలువురు రైతులు 'కృతజ్ఞత పాదయాత్ర' పేరుతో తిరుమలకు చేరుకుని సోమవారం సాయంత్రం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ సుధాకర్ తదితరులు మీడియాతో మాట్లాడుతూ.. రాజధానిని కాపాడుకుందాం-రాష్ట్రాన్ని పరిరక్షించుకుందామనే లక్ష్యంతో 1,631 రోజుల పాటు ఉద్యమం చేశామన్నారు. అయితే గత పాలకులు తమపై దౌర్జన్యాలు చేశారన్నారు. ఈ క్రమంలో న్యాయస్థానం టూ దేవస్థానం పేరుతో చేసిన పాదయాత్రను కూడా వైసీపీ నాయకులు అడుగడుగునా అడ్డుకున్నారని వాపోయారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రజల సహకారంతో రాజధానికి, రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తూ పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేశామన్నారు.అమరావతిని రక్షించడంతో పాటు రాష్ట్ర ప్రజలను కష్టాల నుంచి బయటకు తీసుకురావాలని స్వామిని గతంలో కోరుకున్నామన్నారు. శ్రీవారి, ప్రజల ఆశీస్సులతో రావణకాష్టంగా ఉన్న రాష్ట్రం ఎన్నికల తరువాత రామరాజ్యంగా మారిందన్నారు. ఈ క్రమంలో కృతజ్ఞత పాదయాత్ర పేరుతో 21 రోజుల పాదయాత్ర చేసి స్వామిని దర్శించుకున్నామన్నారు. పాలకులకు పూర్తి శక్తి సామర్థ్యాలు ఇచ్చి, అమరావతితో పాటు ఏపీని అభివృద్ధి చేసేలా ఆశీర్వదించమని కోరుకున్నామన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

టీటీడీ సర్వర్లు డౌన్



చంద్రగిరి సమీపంలోని శ్రీవారిమెట్టు నడకమార్గంలో సర్వర్లు మొరాయించడంతో శ్రీవారి భక్తులు ఇబ్బంది పడ్డారు.కాలినడక భక్తుల సౌకర్యార్థం శ్రీవారిమెట్టు ప్రారంభంలో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు దివ్యదర్శన టోకెన్లు జారీ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే రెండురోజులుగా వర్షం కురుస్తున్న నేపథ్యంలో సోమవారం ఉదయం సర్వర్లు నిలిచిపోవడంతో టోకెన్ల జారీలో అంతరాయం ఏర్పడింది. దీంతో కాలినడక భక్తులు కౌంటర్ల వద్ద క్యూలైన్లలో తడుస్తూనే బారులు తీరాల్సి వచ్చింది. 10 గంటల తరువాత సర్వర్లు పనిచేయడంతో భక్తులకు టైం స్లాట్ టోకన్లు జారీ చేశారు.

- చంద్రగిరి

నిమ్మకు కాసుల వర్షం



గూడూరు నిమ్మ మార్కెట్‌లో సోమవారం కిలో నిమ్మకాయలు రూ.90కి డీబీఆర్ కంపెనీ కొనుగోలు చేసింది. ఆడపాదడపా వర్షాలు కురిసి నేలంతా బురదమయం కావడంతో నిమ్మకాయలు కోసేందుకు వీల్లేకుండా పోయింది.దీంతో మార్కెట్‌కు కాయలు తక్కువగా రావడంతో ధర ఊపందుకుంది. 50 కిలోల టిక్కీ బస్తా ధర రూ.4,500, 80 కిలోల లూజు బస్తా రూ.7,200 పలకడంతో నిమ్మరైతులు సంతోషభరితులయ్యారు. పొడి, సన్న కాయలు సైతం కిలో రూ.40 నుంచి రూ.50 పలకడంతో రైతుల్లో ఆనందం కనిపించింది.

-గూడూరు అర్బన్

విషాహారంతో విలవిల

అస్వస్థతపాలైన 128మంది గురుకుల పాఠశాల విద్యార్థులు



నాయుడుపేట ఆస్పత్రిలో విద్యార్థులకు చికిత్స

నాయుడుపేట/నాయుడుపేట టౌన్, జూలై 15 : వసతి గృహ నిర్వాహకుల కక్కుర్తి....అధికారుల పర్యవేక్షణలోపం ఆ పేద విద్యార్థుల పాలిట శాపమైంది. చెడిపోయిన ఆహారం తినడంతో వందమందికి పైగా విద్యార్థులు ఆస్పత్రులపాలవ్వాల్సివచ్చింది. నాయుడుపేట లోని అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలలో మొత్తం 881 విద్యార్థులుంటుండగా, శనివారం సాయంత్రం 520మంది మాత్రమే వున్నారు. ఆదివారం ఉదయం వరకు ఉల్లాసంగా ఉన్న విద్యార్థులు టిఫిన్ తిన్నాక అస్వస్థత పాలయ్యారు.ముందురోజైన శనివారం తయారుచేసిన పూరీలను అల్పాహారంగా అందించడంతో కొంతమంది విద్యార్థులకు విరోచనాలయ్యాయి. ఇది గమనించిన స్థానిక కాంపౌండర్ వారికి మందులందించారు.ఆదివారం కావడంతో మధ్యాహ్నం చాలామంది తల్లిదండ్రులు పిల్లలను చూసేందుకు వచ్చారు. వారు తెచ్చిన భోజనాన్ని విద్యార్థులు తినడంతో అప్పటికే హాస్టల్‌లో వండిపెట్టి ఉన్న చికెన్ భోజనం మిగిలిపోయింది.దాన్నే వేడిచేసి రాత్రి విద్యార్థులకు పెట్టారు.భోంచేసిన వెంటనే విద్యార్థులు ఒకరి తరువాత ఒకరు వాంతులు, విరోచనాలు, కడుపునొప్పితో బాధపడ్డారు. దీంతో కంగారుపడ్డ వసతిగృహ అధికారులు అర్ధరాత్రి సమయంలో 66మందిని నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.39మందిని గూడూరు, ప్రభుత్వ ఆస్పత్రికి, 16మందిని సూళ్లూరుపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం అందజేశారు.మరో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరుకు తరలించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి బాల వీరాంజనేయస్వామి

ప్రిన్సిపాల్ , వార్డెన్ సస్పెన్షన్

నాయుడుపేట గురుకుల పాఠశాలలో వసతిగృహాల్లో అపరిశుభ్రత రాజ్యమేలుతోంది.మరుగుదొడ్లు, వంటగది దుర్వాసనకు కేంద్రాలైపోయాయి.విద్యార్థులు అస్వస్థత పాలయ్యారని తెలిసి సోమవారం ఉదయం గురుకుల పాఠశాలను పరిశీలించిన కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే విజయశ్రీ విస్తుపోయారు.నిర్వహణలోపంమీద అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదని తెలిసి ప్రిన్సిపాల్ దాదాపీర్, వార్డెన్ విజయభాస్కర్, ఆరోగ్య సహాయకులు ఇద్దరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రకటించారు.జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ చేయిస్తామని తెలిపారు.సీఎం చంద్రబాబు ఆదేశాలతో సాంఘిక సంక్షేమ శాఖామంత్రి బాలాంజనేయస్వామి అస్వస్థతతకు గురైన విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్ నిర్వహణపై మంత్రికి ఫిర్యాదు చేశారు. మూడేళ్ల క్రితం కూడా ఇలాగే జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కఠిన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చిన మంత్రి హాస్టల్‌ను పరిశీలించారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యమందించాలి : వైద్య మంత్రి

తిరుపతి(వైద్యం), జూలై 15: అస్వస్థతకు గురైన గురుకుల విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలందించాలని మంత్రి సత్యకుమార్ వైద్యులను ఆదేశించారు.విద్యార్థుల పరిస్థితిని వైద్యాధికారులతో మాట్లాడి తెలుసుకున్న ఆయన ఎప్పటికప్పుడు పరిస్థితిని తనకు తెలియజేయాలన్నారు.బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు.కలెక్టర్,డీఎంహెచ్‌వో లతో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని మంత్రికి తెలియజేశారు.

బాధ్యులపై కఠిన చర్యలు
- మంత్రి డోలా

గూడూరు, జూలై 15 : నాయుడుపేట గురుకుల పాఠశాలలో ఘటనకు కారకులపై కఠిన చర్యలు చేపట్టి ఈ తరహా చర్యలు పునరావృతం కాకుండా చూస్తామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి చెప్పారు. సోమవారం గూడూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గురుకుల పాఠశాల విద్యార్థులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సంఘటనలో సిబ్బంది అలసత్వం, నిర్లక్ష్యం కన్పిస్తోందన్నారు. కలుషిత ఆహారం కారణంగానే విద్యార్థులు అతిసార బారిన పడినట్లు భావిస్తున్నామన్నారు.ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందన్నారు.ఎమ్మెల్యేలు పాశిం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్,వైద్య ఆరోగ్య శాఖాధికారి శ్రీహరి,మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం,ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు సుధీర్, చంద్రారెడ్డి , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గురుకులంలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, తదితరులు

ఇవి మరుగుదొడ్లా?

881మంది విద్యార్థులున్న గురుకుల పాఠశాలలో మరుగుదొడ్లు 24 మాత్రమే. వాటికి కూడా తలుపుల్లేవు... తలుపులున్న వాటికి గెడియల్లేవు.అపరిశుభ్ర వాతావరణం రాజ్యమేలుతున్నా పరిశుభ్రంగా ఉంచాల్సిన కాంట్రాక్టర్ పట్టించుకున్న దాఖలాల్లేవు. నాడు-నేడు అంటూ గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు గుమ్మరించి పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దామంటూ ఊరూవాడా ప్రచారం చేసుకుంది. మరి ఈ గురుకుల పాఠశాల అప్పట్లో వారికి కనబడలేదేమో.మూడేళ్ల క్రితం ఇలాగే విద్యార్థులు అస్వస్థతకు గురైనా పట్టించుకోకపోవడంతో దుస్థితి కొనసాగింది.ఈసారి ఘటన జరిగిందని తెలిసిన వెంటనే మంత్రి , స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ వెంకటేశ్వర్ , అధికారులు గురుకులాన్ని పరిశీలించారు.విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు.విద్యార్థులు కోలుకునేంతవరకు మంగళ, బుధ, గురువారాలు సెలవు ప్రకటించారు. గృహాలకు వెళ్లలేని విద్యార్థులకు టీటీడీ కల్యాణ మండపంలో వసతి, భోజనాలను ఏర్పాటు చేస్తామన్నారు.యుద్ధప్రాతిపదికన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇవ్వడం విద్యార్థుల తల్లిదండ్రుల్లో సంతోషాన్ని నింపింది.



గురుకులంలో సీలింగ్ ఫ్యాన్ పరిస్థితి

పొగమంచు దోబూచులాట



పొగమంచులో గాలిగోపురం శంఖుచక్రనామాలు



జీఎన్సీ వద్ద..



ఘాట్‌రోడ్డులో..

తిరుమల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో సోమవారం కూడా చిరుజల్లులు కురిశాయి.వేకువజాము నుంచి రాత్రి వరకు ఎడతెరిపిలేకుండా చినుకులు పడుతూనే ఉన్నాయి. దీంతో శ్రీవారి దర్శనానికి వెళ్లేవారితో పాటు కాలినడకన వచ్చే భక్తులు కూడా తడుస్తూనే రాకపోకలు సాగించారు.తిరుమలలో వాతావరణం మారిపోయింది. విపరీతమైన చలి భక్తులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.మరోవైపు తిరుమల క్షేత్రాన్ని, శేషాచల కొండలను పొగమంచు కప్పేసిన దృశ్యాలు భక్తులకు కనువిందు చేశాయి.చిరుజల్లులు కురుస్తున్న నేపథ్యంలో టీటీడీ ఘాట్‌రోడ్లపై నిఘా పెట్టింది.తరచూ కొండచరియలు విరిగిపడే ప్రాంతాల్లో ఫారెస్ట్, విజిలెన్స్, ఇంజినీరింగ్ అధికారుల బృందాలు పరిశీలించాయి.ఎక్కడైనా బండరాళ్లు, కొండచరియలు, చెట్లు విరిగిపడితే వెంటనే స్పందించేలా సిద్ధమయ్యాయి.

తిరుపతిలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా
ఎస్పీ సుబ్బరాయుడు



తిరుపతి(నేరవిభాగం), జూలై 15: దేశ విదేశాల్లో ప్రఖ్యాతిగాంచిన తిరుపతిలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు చెప్పారు. తిరుపతిలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం ఎస్పీగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలో మంచిగా పనిచేస్తే దేవుడికి సేవ చేసినట్లు భావిస్తామన్నారు.రోజూ వేలాదిమంది భక్తులు వచ్చిపోయే తిరుపతిలో శాంతి భద్రతలు పరిరక్షించడమే తన ప్రధాన అజెండా అన్న ఆయన ఈ విషయంలో అందరి సహకారాన్నీ కోరుతున్నట్లు చెప్పారు.అందరూ చట్టాలకు లోబడి పనిచేయాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.విజుబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు.అంతకుముందు ఏఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, విమలకుమారి, డీఎస్పీలు రవిమనోహరాచారి, రమణకుమార్, భవ్యశ్రీ, సీఐలు, ఎస్ఐలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

యానిమల్ హజ్బెండరీ డిప్లొమాకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి రూరల్, జూలై 15 : ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో యానిమల్ హజ్బెండరీ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ వి.చెంగల్పరాయులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదవతరగతి విద్యార్హతతో ఆంగ్లమాధ్యమంలో నిర్వహించే ఈ కోర్సుకు ఈనెల 8నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని, ఇదే నెల 22వతేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. విద్యార్థుల పదోతరగతి మెరిట్, రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని, ఆసక్తి, అర్హత ఉన్న జనరల్, బీసీ అభ్యర్థులు రూ.880, ఎస్సీ ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.440 దరఖాస్తు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థుల వయోపరిమితి 2024ఆగస్టు31 నాటికి 15-22సంవత్సరాల మధ్య ఉండాలని, ఇతర వివరాలు, ఆన్‌లైన్ దరఖాస్తు కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఎస్వీవీయూ. ఈడీయూ. ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.వర్సిటీపరిధిలోని ప్రభుత్వ కళాశాలల్లో 330సీట్లు, ప్రైవేట్ కాలేజీల్లో 660సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

వైసీపీ నాయకుడి డాబా కూల్చివేత

టీడీపీ శ్రేణులకు సంబంధంలేదన్న యజమాని



డాబాను కూల్చివేసిన దృశ్యం

చంద్రగిరి, జూలై 15: చంద్రగిరి మండలం నాగయ్యగారిపల్లె సమీపంలో మేడసాని డాబా హౌస్‌ను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. అనంత గుర్రప్పగారిపల్లెకు చెందిన వైసీపీ నాయకుడు మేడసాని ప్రవీణ్‌కుమార్ నాగయ్యగారిపల్లె సమీపంలో ఈ డాబా నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి 11 గంటలకు ఆయన భార్య స్వర్ణ డాబా మూసివేసి ఇంటికి వెళ్లిపోయాక కొందరు మంకీ క్యాప్ ధరించి పొక్లయినర్‌తో డాబాను కూలుస్తుండగా అందులో పనిచేస్తున్న సిబ్బంది అడ్డుకున్నారు. అయితే వారిపై కూడా గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి, డాబాను పూర్తిగా కూల్చివేసారు. డాబాలోని సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌ను కూడా ఎత్తుకెళ్లారు. డాబా యజమాని భార్య స్వర్ణకు సిబ్బంది ఫోన్ చేసి చెప్పడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. డాబా కూల్చివేత సమాచారం తెలియడంతో విజయవాడకు వెళ్లిన ప్రవీణ్‌కుమార్ సోమవారం ఉదయం ఇంటికొచ్చారు. డాబా వద్దకు చేరుకుని టీడీపీ శ్రేణులే కూల్చివేశారని ఆరోపించారు. అయితే సాయంత్రం డాబా కూల్చివేయడంలో ఎమ్మెల్యే నానికి, టీడీపీ శ్రేణులకు ఎలాంటి సంబంధంలేదని చెప్పారు. తాను వైసీపీలో ఉన్నందున టీడీపీ వాళ్ళే కూల్చివేసి ఉంటారని అనుమానంతో ఆరోపించినట్లు పేర్కొన్నారు. టీడీపీ శ్రేణులు క్షమించాలని కోరారు.

మోహన్‌బాబును కలిసిన ఎమ్మెల్యే నాని



చంద్రగిరి, జూలై 15: చంద్రగిరి మండలం, ఎ.రంగంపేట సమీపంలోని ఎంబీయూలో సినీ నటుడు మోహన్‌బాబును సోమవారం ఎమ్మెల్యే పులివర్తి నాని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నానీకి మోహన్‌బాబు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎన్నో ఆటుపోట్లకు తట్టుకొని ఎమ్మెల్యేగా గెలవడం సంతోషకరమన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, మార్కెట్‌యార్డు కమిటీ మాజీ చైర్మన్ ముడిపల్లి సురేష్‌రెడ్డి, నాయకులు గౌస్‌బాషా, బాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాల ఏర్పాటుకు సహకరించండి

స్విమ్స్ డైరెక్టర్‌తో ఎమ్మెల్యే నాని

తిరుపతి రూరల్, జూలై 15: చంద్రగిరి నియోజకవర్గంలో పేద ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం అన్ని మండలాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించాలని స్విమ్స్ డైరెక్టర్‌ని ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. తిరుపతి రూరల్ మండలం వేంకటపతినగర్‌లో స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ శిబిరంలో ప్రజలకు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కోరిక మేరకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పెద్దిరెడ్డి ఇసుక నిల్వలపై కొనసాగుతున్న దాడులు

ములకలచెరువు, జూలై 15: అన్నమయ్య జిల్లా ములకల చెరువు మండలంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పోగు చేసిన ఇసుక నిల్వలపై దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా సోంపల్లె పంచాయతీ అడివిచెరువు మార్గంలోని ఇసుక నిల్వలను సోమవారం అధికారులు సీజ్ చేశారు. ఇక్కడున్న ఇసుక నిల్వలు 2202 క్యూబిక్ మీటర్లుగా గుర్తించారు. 3303 టన్నులు ఉన్న ఇసుక విలువ రూ.13 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. కాగా ములకలచెరువు మండలం సోంపల్లె పంచాయతీ రెడ్డివారిపల్లె సమీపంలో ఇటీవల పెద్దిరెడ్డి పోగు చేసిన రూ.17 కోట్ల విలువైన 41 వేల టన్నులు ఉన్న ఇసుక కొండలను సీజ్ చేసిన విషయం విదితమే. వైసీపీ ప్రభుత్వ పాలనలో పెద్దతిప్పసముద్రం మండలం టి.సదుం సమీపంలోని సంగమేశ్వరస్వామి ఆలయం సమీపంలోని పాపాఘ్ని నుంచి ఈ ఇసుకను ఇక్కడికి తరలించారు.

రికార్డులు లేకుండానే బిల్లుల చెల్లింపు

ఉపాధి హామీ రికార్డుల తయారీలో తలమునకలైన సిబ్బంది - ప్రభుత్వం మారడంతో నీళ్లు నములుతున్న అధికారులు

ఎర్రావారిపాలెం, జూలై 15 : ఎర్రావారిపాలెం మండలంలో ఉపాధి హామీ పథకం అమలు మాయాజాలంతో స్థానిక ప్రజాప్రతినిధులకు కనక వర్షం కురిపించింది. ఏడాది లోపు జరిగిన పనులకు దాదాపు లక్షల్లో అధికారులు మండలంలో వలసల నివారణ పేరిట కూలీలకు చెల్లించేశారు. సాధారణంగా పనులు పూర్తిచేసిన అనంతరం రికార్డుల్లో నమోదైన పిమ్మట బిల్లులు చెల్లిస్తారు. నిబంధనలకు విరుద్ధంగా అధికారుల మాయాజాలంతో రికార్డుల్లో నమోదు చేయకుండానే నాయకులు అడిగిందే తడవుగా ఉపాధిహామీ అధికారులు డబ్బులు చెల్లించేశారు. అయితే చెల్లించిన డబ్బులకు ఎంతమేరకు బిల్లులు నమోదు చేయాలనే దాని కోసం గత 15 రోజులుగా రాత్రింబవళ్లు ఉపాధి సిబ్బంది కార్యాలయంలోనే తిష్టవేసి పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. వచ్చేది తమ ప్రభుత్వమేనని.. తాము చెప్పినట్లుగా పనులు చేయకుండానే కనీసం రికార్డుల్లో నమోదు చేయకుండా నేరుగా డబ్బులు చెల్లించేందుకు వెంటనే బిల్లులు పెట్టాలని గ్రామస్థాయి నాయకులు ఉపాధి హామీ మండల స్థాయి అధికారులతో కుమ్మక్కయ్యారు. ఇంకేముంది లక్షల్లో కూలీల పేరిట ప్రభుత్వ ధనాన్ని అప్పనంగా తమ సొంత జేబుల్లోకి వేసుకున్నారు. ప్రభుత్వం మారడంతో మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి హామి క్షేత్ర సహాయకులు 80 శాతం మంది తొలగింపబడ్డారు. వారి స్థానంలో కొత్త వారు బాధ్యతలు చేపట్టారు. కానీ ఏడాదిగా పనులు ఎంత మేర జరిగాయి.. ఎంత డబ్బు ఖర్చు అయిందనే వివరాలు సక్రమంగా లేకపోవడంతో ఆ రికార్డులు కొత్తగా నియమితులైన ఫీల్డ్ అసిస్టెంట్లకు అందజేయలేదు. పక్షం రోజులుగా మండల కార్యాలయంలో సమావేశాలు జరుగుతూనే ఉన్నాయి. రికార్డులు సక్రమంగా లేకపోవడంతో అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. చేయని పనులకు బిల్లులు డ్రా చేసుకుని తినేసిన మండల స్థాయి నాయకులు కొత్త ప్రతిపాదన తీసుకొస్తున్నారు. ఫారం పాండ్లు, ట్రెంచీల నిర్మాణంతో పాటు పండ్ల తోటల పెంపకం తాము చేపట్టామని, బిల్లులు అయిపోయిన తర్వాత రైతులు వాటిని లేకుండా చేశారని, ఈ విషయంలో సర్దుకుపోవాలని ప్రతిపాదన చేస్తున్నారు. వాస్తవంగా గతంలో జరిగిన పనులు ఉంటే ఏడాదిలోపే రైతులు మామిడి చెట్లను తొలగించడం, ఫారం పాండు, ట్రెంచ్‌లను పూడ్చడం వీలు పడేది కాదు. కానీ గతంలో జరిగిన అవినీతిని కప్పి పుచ్చుకునేందుకు ఈ విధమైన ప్రతిపాదనలు తెస్తున్నారని టీడీపీ నాయకులు ఎదురు తిరుగుతున్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం పైన ఉన్న ఉపాధి కార్యాలయంలో మండలంలోని కొత్త, పాత క్షేత్ర సహాయకులతో పాటు టీడీపీ నాయకులతో ఉపాధి సిబ్బంది విడతల వారీగా సమావేశమయ్యారు. ఈ సమావేశానికి గతంలో వైసీపీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు కూడా కొందరు హాజరై రాజీ మార్గాలను సూచించారు. అయినా ప్రజాధనాన్ని దోచేసిన నాయకుల అవినీతి నిగ్గు తేల్చాలని కొంతమంది టీడీపీ నాయకులు పట్టుబడుతున్నారు. మండలంలో ఉపాధి బిల్లుల చెల్లింపు రికార్డులు తమ దగ్గర సిద్ధంగా లేవని, కొంత సమయం ఇస్తే పూర్తి చేస్తామని ఉపాధి హామీ పీఓ ఆశారాణి టీడీపీ నాయకులకు సర్దిచెబుతున్నారు. మండలంలో ఉపాధి హామీ పథకం అమలులో జరిగిన అవినీతి బయటపడుతుందా లేక లోలోన సర్దుకుంటారా అనేది మరి కొద్దిరోజులు వేచి చూడాల్సి ఉంటుంది.

కాలువలపై ఆక్రమణలు తొలగించండి..!

ఎమ్మెల్యే పులివర్తి నాని



తుమ్మలగుంట గ్రామంలో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతి రూరల్, జూలై 15: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామ పరిధిలో కాలువల ఆక్రమణలని గుర్తించి, తొలగింపునకు తగు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశించారు. గ్రామస్తుల కోరిక మేరకు సోమవారం అధికారులతో కలసి ఎమ్మెల్యే తుమ్మలగుంటని సందర్శించారు. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు పంచాయతీలో బురదమయంగా మారిన పలు ప్రాంతాలను పరిశీలించారు. గ్రామానికి ఆనుకుని ఉన్న చెరువుని పరిశీలించి మాట్లాడారు. చెరువుకి నీరు వచ్చే కాలువలు, దిగువ ప్రాంతానికి నీరు వెళ్లే పంట, మరవ కాలువలు పూర్తిగా ఆక్రమణలకు గురైనట్లు గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ ఆక్రమణల కారణంగా 2021లో వరద సమయంలో లోతట్టు ప్రాంతాలు, కాలనీలు పూర్తిగా నీటి మయమైనట్లు గుర్తు చేశారు. ఇప్పటికే వర్షాలు ప్రారంభమైనందున్న అప్పటి పరిస్థితి పునరావృత్తం కాకుండా ఆక్రమణలను గుర్తించి తొలగింపు చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. దీనికి సంబంధించిన నివేదిక తనకు అందించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ పాలకులు ప్రజాసంక్షేమాన్ని విస్మరించి, స్థానికులపై పగపట్టారని విమర్శించారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులకు ప్రజలు ఇబ్బందిపడుతున్నారని, తాను అటువంటి వాటిని ప్రోత్సహించేది లేదని స్పష్టం చేశారు. టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, గ్రామకమిటీ అధ్యక్షుడు బిరుదాల భాస్కర్‌రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి, చెంగల్రాయ నాయుడు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

దామినేడు గృహ సముదాయాల్లో సమస్యలు పరిష్కరిస్తా :నాని

తిరుచానూరు: గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా దామినేడు గృహ సముదాయాల్లో సమస్యలు తిష్ట వేసి ఉన్నాయని, తక్షణమే ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశించారు. దామినేడు హౌసింగ్‌కాలనీని సోమవారం అధికారులతో కలిసి ఎమ్మెల్యే నాని పరిశీలించారు. కొన్ని చోట్ల బ్లాక్‌ల్లో వర్షపునీరు ఉరుస్తుండటం, పారిశుధ్యం అధ్వానంగా ఉండటాన్ని ఎమ్మెల్యే గమనించి యుద్ధప్రాతిపదికన పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాగునీటి పైపులైన్‌లో లీకేజీ జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఇక్కడి అధ్వాన పరిస్థితులు చూస్తే మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి ఏ మేరకు అభివృద్ధి చేశాడో తెలుస్తుందన్నారు.

అవధాన నైపుణ్యాలను పెంచుకోవాలి

తిరుపతి రూరల్, జూలై 15: విద్యార్థులు చదువుతోపాటు అవధాన నైపుణ్యాలు పెంచుకోవాలని బెంగళూరుకు చెందిన విద్యానికేతన్ డైరెక్టర్ విజయ కృష్ణ రాజగోపాల్ పేర్కొన్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో సోమవారం మూడవ అవధాన సంగమ ప్రారంభోత్సవం జరిగింది.వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, మానవవిజ్ఞాన కేంద్రం డైరెక్టర్ సంపదానందమిశ్ర, డాక్టర్ ధూళిపాల మహదేవమణి, రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ, అకడమిక్ డీన్ రజనీకాంత శుక్లా, కోఆర్డినేటర్ సచ్చిదానందమూర్తి, డాక్టర్ నీలాబ్‌శర్మ, డాక్టర్ వైష్ణవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేలో 40 సమస్యల పరిష్కారం

చంద్రగిరి, జూలై 15: గత నెల 24వ తేదీన నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుల్లో 40 సమస్యలను పరిష్కరించినట్లు ఎంపీడీవో వెంకటసూర్యసాయి తెలిపారు.నరసింగాపురం, రెడ్డివారిపల్లె పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులకు రెండు నెలల వేతనాలు అందజేశారని, చంద్రగిరి పంచాయతీ క్రమబద్ధీకరణ గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, ,దోర్నకంబాల ఎస్టీ కాలనీలో 350 మీటర్లు సీసీ రోడ్డు మంజూరు చేసినట్లు తెలిపారు.

జడ్పీహైస్కూల్లో నూతనభవనం ప్రారంభం

మంగళం, జూలై 15: మంచి విద్యతోనే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. మంగళం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు నేడు రెండవ దశ పనుల్లో భాగంగా నిర్మితమైన నూతన భవనాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు.పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి హెచ్‌ఎం కేశవులు నాయుడు తీసుకురాగా, త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పాఠశాలల్లోని 36మంది ఉపాధ్యాయులు సేకరించిన రూ.70వేలను ఎమ్మెల్యే అందజేశారు. అమరావతి రాజధాని నిర్మాణానికి విరాళంగా రూ.10,116 చెక్కును ఎమ్మెల్యేకు హెచ్‌ఎం అందజేశారు. డీఈవో శేఖర్,డీవైఈవో బాలాజీ, నాడు నేడు ప్రోగ్రాం కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, ఎంపీడీవో రమేష్, టీడీపీ నాయకులు ఈశ్వర్ రెడ్డి, రామాంజేరి మహేశ్వరి, గోపీనాథ్, ఈశ్వరయ్య, సురేష్, పెరుగు భాస్కర్‌రెడ్డి, గోవిందరాజులు, చెన్నరాయప్ప, సబ్బుయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, అల్లాబాషా, గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం బోల్తా: ఒకరి మృతి



గోపి(ఫైల్‌ఫొటో)

రామచంద్రాపురం, జూలై 15: రాయలచెరువుకట్ట నెత్తెకుప్పం ప్రధాన రహదారి ఎన్ఆర్ కమ్మపల్లి భారత మిట్ట సమీపంలో స్కూటర్‌బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు నెత్తకుప్పం హరిజనవాడకు చెందిన గోపి(36) తన ద్విచక్ర వాహనంపై కుప్పం బాదూరుకు వస్తుండగా, ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి బోల్తాపడ్డాడు. ఈ ఘటనలో గోపికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి వైద్యసేవల నిమిత్తం ప్రైవేటు వాహనంలో తిరుపతికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా, ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

అక్షయక్షేత్రంలో అన్నదానం



దేవానందమ నాయుడితో భానుప్రకాష్ తదితరులు

రామచంద్రాపురం, జూలై 15: మాజీ జడ్పీటీసీ, టీడీపీ సీనియర్ నాయకుడు అబ్బూరు దేవానందమనాయుడు పుట్టినరోజు సందర్భంగా అక్షయ క్షేత్రంలో సోమవారం టీడీపీ కార్యకర్తలు అన్నదానం చేశారు.దేవానందమ నాయుడికి నగరిఎమ్మెల్యే భానుప్రకాష్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.వసంతనాయుడు, గరుడాద్రినాయుడు, బాబునాయుడుపాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలకు తొలగింపు నోటీసులు



నోటీసులు ఇచ్చిన దుకాణాల సముదాయం

మంగళం, జూలై 15: మంగళం పరిధిలోని సప్తగిరికాలనీ పంచాయతీలోని వెంకటేశ్వరకాలనీ వద్ద అక్రమంగా నిర్మించిన 20 దుకాణాలు తొలగిస్తున్నట్లు సోమవారం పంచాయతీ కార్యదర్శి విజయ్‌భాస్కర్ సంబంధిత దుకాణ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. అలాగే దుకాణాలకు నోటీసులు అందించారు. ఈ భూమిలో గతంలో గెజిటెడ్ ఆఫీసర్స్ లేఔట్‌లో భాగంగా పంచాయతీకి రిజిస్టర్ చేయబడినట్లు సమాచారం. మంగళం పరిధిలోని సర్వే నెంబరు 2/1లో గల భూమిలో గత ప్రభుత్వ హయాంలో దుకాణాలను నిర్మించారు. ఇటీవల ఐదు నిర్మాణాలను తొలగించారు. దుకాణాల సముదాయాన్ని కూల్చివేసే సమయంలో దుకాణ నిర్వాహకులు పంచాయతీ, రెవెన్యూ, పోలీసు అధికారులకు సహకరించాలని పంచాయతీ కార్యదర్శి విజయభాస్కర్ నోటీసుల్లో పేర్కొన్నారు.

సీడీసీఎంఎస్‌లో లెక్కలేనితనం

- గతంలో ఘనకీర్తి నేడు అధోగతి
- అక్రమాలకు సహకారం.. భారీగా నిధుల దుర్వినియోగం

జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (సీడీసీఎంఎస్)లో 'లెక్క'లేనితనం నెలకొంది. ఇక్కడి అవినీతిపై తరచూ పత్రికల్లో వార్తలు వచ్చినా అప్పటి మంత్రి పెద్దిరెడ్డి భయంతో సహకారశాఖ అధికారులు అటువైపు చూడలేదు. వైసీపీ ఐదేళ్ల కాలంలో ఆ పార్టీ నేత సహదేవరెడ్డి రెండేళ్లు, ఆయన సతీమణి నాగలక్ష్మి మూడేళ్లు పాలకవర్గం చైర్మన్లుగా వ్యవహరించారు. 2019 వరకు టీడీపీ హయాంలో చైర్మన్‌గా ఉన్న శ్యామరాజు వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీలో చేరిపోయారు. వైసీపీ హయాంలో సెవెన్‌మెన్ కమిటీ పాలకవర్గం జేబులు నింపుకోవడానికే ప్రాధాన్యమిచ్చిందన్న ఆరోపణలున్నాయి. దీంతో సొసైటీ నష్టాల్లో మునిగిపోయింది.

- చిత్తూరు కలెక్టరేట్



చిత్తూరులోని సీడీసీఎంఎస్ ప్రధాన కార్యాలయ భవనం

1943లో చిత్తూరు హోల్‌సేల్ కో-ఆపరేటివ్ స్టోర్ లిమిటెడ్‌గా ఏర్పడి, ఆ తర్వాత 1956లో సీడీసీఎంఎస్ పేరిట రిజిస్టర్ చేసుకుని వ్యాపారం ప్రారంభించింది. రైతులకు సేవలందించడంలో డీసీసీబీ, సీడీసీఎంఎస్‌లదే కీలక పాత్ర. డీసీసీబీ ద్వారా రైతులకు రుణాలిస్తే.. సీడీసీఎంఎస్ ద్వారా ఎరువులు ఇస్తున్నారు. అదే సమయంలో సీడీసీఎంఎస్ సంస్థ ఇతర ప్రభుత్వ సంస్థలకు సేవలందిస్తూ 82 ఏళ్లుగా ఆదాయాన్ని సమకూర్చుకుంటూ వస్తోంది. నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, జిప్సమ్, ఎరువులు, క్రిమి సంహారక మందుల అమ్మకాలు, వేరుశనగ విత్తనకాయల అమ్మకాలు, ధాన్యం కొనుగోళ్లు నిర్వహించి గతంలో ఉత్తమ సహకార సంస్థగా పేరు పొందింది. గతంలో టీటీడీలో లడ్డూ తయారీకి అవసరమైన పప్పు దినుసులను లాభాపేక్ష లేకుండా సీడీసీఎంఎస్ సరఫరా చేసింది. 1955, 1962లో తిరుపతి ఎమ్మెల్యేగా ఉంటూ, టీటీడీ బోర్డు సభ్యుడిగా కొనసాగిన రెడ్డివారి నాదమునిరెడ్డి చొరవతో ఇదంతా జరిగింది. అటువంటి ఘనకీర్తి కలిగిన సహకార సంస్థ తీరు కొన్నేళ్లుగా వివాదాస్పదంగా మారింది. మంచి పేరు మసకబారి నేడు అధోగతి పాలైంది.



పట్టించుకోకుండా వదిలేయడంతో వాయల్పాడు డిపో గోడౌన్‌లో పెరిగిన చెట్లు

ఆస్తులు ఆక్రమణలకు గురవుతున్నా...

గతంలో సీడీసీఎంఎస్ పరిధిలో 10-12 డిపోలు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య ఆరుకు పడిపోయింది. వాయల్పాడు డిపో భవనం మధ్యలో రాగిచెట్టు మొలిచినా, దానిని తొలగించలేదు. దాదాపు అన్ని డిపోల్లోనూ ఇంచుమించు ఇవే పరిస్థితులున్నాయి. వేరుశనగ విత్తన అమ్మకాల ప్రక్రియ ఆర్బీకేలకు వెళ్లడంతో ఈ సంస్థ ఆదాయం పూర్తిగా తగ్గింది. బాడుగుల రూపేణా వస్తున్న రూ.25లక్షలే ఉద్యోగులకు జీతాలిచ్చేందుకు ఆదుకుంటున్నట్లు సమాచారం.

నిధుల దుర్వినియోగం

సీడీసీఎంఎస్‌లో నిధుల దుర్వినియోగంపై అనేక ఫిర్యాదులున్నాయి. ఎంత ఆదాయం వస్తోంది? ఎంత ఖర్చవుతోందనే లెక్కలు తేలడం లేదు. శాఖల్లో ఎరువుల స్టాక్ వెరిఫికేషన్ జరగడం లేదు. శాఖల తనిఖీలు అసలుకే లేదు. సిట్టింగ్ ఫీజు ఇష్టారాజ్యంగా వాళ్లే పెంచుకుంటున్నారు. ఉద్యోగుల వద్ద ఉన్న ఔట్‌స్టాండింగ్ నిధుల వసూళ్లను మరచిపోయారు. ఆస్తులు, ఫర్నిచర్ రిజిస్టర్లు లేవు. ఈపీ (ఎగ్జిక్యూటివ్ పిటిషన్)లపై సంవత్సరాల తరబడి చర్యలు తీసుకోవడంలో పాలకవర్గం విఫలమైంది. గతంలో బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేసి రిటైరైన వెంకటమునిరెడ్డి స్వాహా చేసిన రూ.2.34 లక్షల రికవరీ ఊసేలేదు.

కొనసా...గుతున్న విచారణ

2019 వరకు చైర్మన్‌గా పనిచేసిన శ్యామరాజు హయాంలో జరిగిన అక్రమాలపై విచారణ కొనసాగుతోంది. అగ్రిమెంటు రికార్డు ట్యాంపరింగ్ చేసినట్లు ఫిర్యాదులున్నాయి. శాంతిపురం సొసైటీలో బంగారు రుణాల్లో రూ.కోటి దుర్వినియోగంపై సహకారశాఖ అధికారులు ఏళ్ల తరబడి విచారణ చేస్తూనే ఉన్నారు. ఈయన హయాంలో లెక్కకు మించి అక్రమాలు జరిగాయని విమర్శలున్నాయి. వీటి నుంచి తప్పించుకునేందుకే ఆయన గత ప్రభుత్వ హయాంలో వైసీపీలో చేరినట్లు చెబుతున్నారు.

వరుస నష్టాలు..

సహకార శాఖ ఆడిట్ అధికారులు తయారు చేసిన నివేదికల మేరకు సీడీసీఎంఎస్ వరుస నష్టాల్లో కూరుకుపోయింది. నివేదిక మేరకు చూసుకుంటే.. 2019-20లో రూ.43.13 లక్షలు, 2020-21లో రూ.15.98 లక్షలు, 2021-22లో రూ.16.30 లక్షల నష్టాల్లో ఉంది. తిరుపతిలో ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న సీడీసీఎంఎస్‌కి చెందిన హోటల్ స్థలం లీజు వ్యవహారంలో పాలకవర్గం తమ ఇష్టారాజ్యంగా నిబంధనలకు విరుద్ధంగా పెంచుకుంటోంది. లెక్కల్లో చూపేది కొంత, సొంత జేబుల్లో వేసుకునేది మరికొంతగా మారిందన్న ఆరోపణలున్నాయి.

రూ.33 లక్షల బకాయిల వసూళ్లు గాలికి

సీడీసీఎంఎస్‌లో 2013 నుంచి రూ.33 లక్షల బకాయిలున్నాయి. గత ఐదేళ్లలో పాలకవర్గం బకాయి వసూళ్లపై దృష్టి పెట్టలేదు. వారిపై ఈపీ దాఖలు చేయకపోవడం పట్ల మతలబు ఏమిటో తెలియడం లేదు. వేరుశనగ విత్తనాలు, నవధాన్యాలను సింగిల్ విండోలు, ప్రైవేటు వ్యక్తుల ద్వారా అమ్మగా, దానికి సంబంధించిన రూ.33,98,500 బకాయిల వసూళ్లను 11 ఏళ్లుగా పట్టించుకోవడం లేదు. దీనికి వడ్డీ, అపరాదపు వడ్డీ, వడ్డీపై వడ్డీ అంతా కలిపితే రూ.50 లక్షలకు పెరిగే అవకాశం ఉంది. సింగిల్ విండోల వారీగా శాంతిపురం రూ.6.10 లక్షలు, శ్రీరంగరాజపురం రూ.3.67 లక్షలు, పుంగనూరు రూ.2.70 లక్షలు, గుడిపాల రూ.2.94 లక్షలు, కుప్పం 1.33 లక్షలు, ఐరాల రూ.59 వేలు, కొండ్రాజుకాల్వ రూ.63 వేలు, పూతలపట్టు రూ.76 వేలు, తవణంపల్లె రూ.7,700.. రామసముద్రం, చౌడేపల్లి విండోల్లో ప్రైవేటు వ్యక్తుల నుంచి రూ.3.87 లక్షలు, పెద్దమండ్యం, మొలకలచెరువు విండోల్లో ప్రైవేటు వ్యక్తుల నుంచి రూ.2.59 లక్షల బకాయిలు ఉన్నాయి.

సీడీసీఎంఎస్‌కు జడ్పీ సాధారణ నిధులు

రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి సిఫార్సు మేరకు అప్పటి జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి 2020లో జడ్పీ సాధారణ నిధుల నుంచి 10శాతం.. రూ.25లక్షలు విడుదల చేసి సీడీసీఎంఎస్ ప్రధాన కార్యాలయ మరమ్మతు పనులు చేశారు. ఇప్పటికీ ఆ పనులు చేసిన కాంట్రాక్టర్‌కు నిధులు పూర్తిగా విడుదల కాలేదు. 2014-19 నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐసీడీపీ-2 (ఇంటిగ్రేటెడ్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు-2) ద్వారా సీడీసీఎంఎస్‌కు రూ.6.60 కోట్లు వ్యాపారాభివృద్ధి నిమిత్తం ఇచ్చేందుకు ప్రాజెక్టు రిపోర్టు సిద్ధమైంది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు రిపోర్టును పక్కన పెట్టడంతో పైసా కూడా విడుదల కాలేదు.

పక్కదారి పట్టిన నిధులు

ఐదేళ్ల వైసీపీ పాలనలో సీడీసీఎంఎస్‌లో నిధులు పక్కదారి పట్టాయి. ఎరువుల వ్యాపారాన్ని అప్పటి ప్రభుత్వం ఆర్బీకేలకు మళ్లించడంతో వ్యాపారాభివృద్ధి కుంటుపడింది. నిబంధనలకు విరుద్ధంగా సిబ్బంది నియామకం, వారికి భారీగా జీతాలు చెల్లించడం, పలువురిని పర్మినెంట్ చేయడం వంటివి జరిగినట్లు తెలుస్తోంది. ఎరువులు, వేరుశనగ విత్తనాలు, జిప్సం విక్రయాల్లోనూ లెక్కలు తేలడం లేదని సమాచారం. వేరుశనగ, ఎరువుల విక్రయాల్లో ఎంతమేర జీఎస్టీ వసూలు చేశారో రికార్డులు లేవు.

లేని ఉద్యోగుల పేరిట జీతాల చెల్లింపు

చిత్తూరులోని ప్రధాన కార్యాలయంలో అకౌంటెంట్, అటెండర్ పోస్టులు లేకున్నా, వారున్నట్లు సృష్టించి ప్రతినెలా జీతాల రూపేణా రూ.25వేలు డ్రా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. 2019, 2020 సంవత్సరాల్లో కరోనా ఉధృతంగా ఉండి ఎవరూ ఇళ్ల బయటకు రాలేదు. ఆ సమయంలో పాలకవర్గ చైర్మన్ చిత్తూరుకు వచ్చి వెళ్తున్నట్లు, అద్దె కారుకు నెలకు రూ.35 వేలు చెల్లించినట్లు రికార్డులో చూపారు. ప్రస్తుత బిజినెస్ మేనేజర్ ఏ బ్రాంచ్‌నూ తనిఖీ చేసిన దాఖలాల్లేవు. రికార్డులను లోతుగా పరిశీలిస్తే ఇలాంటి ఎన్నో అక్రమాలు బయటపడే అవకాశాలున్నాయి.

ప్రముఖులతో కొత్త ఎస్పీ భేటీ



తిరుపతి(నేరవిభాగం), జూలై 15: కొత్తగా బాధ్యతలు చేపట్టిన జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు సోమవారం టీటీడీ కార్యనిర్వహణాధికారి శ్యామలరావును కలిశారు. స్థానిక ఈవో క్యాంపు కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందచేశారు. కాసేపు తిరుమలలో శాంతి భద్రతలు, విజిలెన్సు, పోలీసు శాఖ మధ్య సమన్వయంపై వీరు చర్చించినట్లు తెలిసింది. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడును ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ సోమవారం కలసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఎస్పీని కలసిన వారిలో డీఎస్పీ చెంచుబాబు, ఏసీఎఫ్ మురళి ఇతర అధికారులు ఉన్నారు.

తిరుపతి(కలెక్టరేట్): ఎస్పీ సుబ్బరాయుడు సోమవారం రాత్రి కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు.

తిరుపతి(ఆర్టీసీ): ప్రజారవాణా విభాగానికి సహకరించాలని కొత్త ఎస్పీ సుబ్బరాయుడును డీపీటీవో చెంగల్‌రెడ్డి కోరారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తరువాత కార్యాలయంలో ఆయన్ను ప్రజారవాణాధికారి, డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి కలసి అభినందనలు తెలియజేశారు.

ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలి : ఎస్పీ



ఎంఆర్‌పల్లి స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూలై 15: ఫిర్యాదుదారులు, బాధితుల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు. సోమవారం ఎస్పీగా బాధ్యతలు స్వీకరించాక ఆయన తిరుపతి రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. రాత్రి గస్తీ సమర్థవంతంగా నిర్వహించి దొంగతనాలు, దోపిడీలు, అఘాయిత్యాలను అరికట్టాలన్నారు. రౌడీలు, ట్రబుల్ మాంగర్స్, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. మహిళలు, వృద్ధులు, వికలాంగుల ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సీఐ అహ్మద్, ఎస్ఐ నాగేంద్రబాబు, షేక్ షావలి తదితరులు వున్నారు.

సంస్కృతవర్సిటీకి న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్



తిరుపతి రూరల్, జూలై 15: తిరుపతిలోని జాతీయ సంస్కృతవర్సిటీకి న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ లభించింది.వర్సిటీలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రీయ సంస్కృతవిద్యాపీఠానికి 2020లో జాతీయవర్సిటీ హోదా లభించగా..మూడేళ్లకాలంలోనే న్యాక్ ఏప్లస్ గ్రేడ్ సాధించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అధ్యాపకులు, సిబ్బంది సమన్వయంతో దీన్ని సాధించగలిగామని, తద్వారా భవిష్యత్‌లో ఎన్నో కొత్త కోర్సులు, ప్రాజెక్టులు, విద్యాకార్యక్రమాలు, పరిశోధనలకు మంచి అవకాశం ఉంటుందని తెలిపారు. సంస్కృతభాషను, భారతీయసంస్కృతిని ప్రజలకు చేరువచేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ, అకడమిక్ డీన్ రజనీకాంత శుక్లా, ఐక్యూఏసీ డైరెక్టర్ సతీశ, పీఆర్వో వి.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కామరాజ్ నాడార్ జయంతి వేడుకలు



అన్నదానంలో సుగుణమ్మ, నవీన్‌కుమార్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), జూలై 15: తమిళనాడు ముఖ్యమంత్రిగా పనిచేసి పేద బడుగు బలహీన వర్గాల గుండెల్లో ప్రత్యేకస్థానాన్ని ఏర్పరచుకున్న కామరాజ్ నాడార్ జయంతి వేడుకలను స్థానిక లీలామహల్ వద్ద నాడార్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, బీజేపీ నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాడార్ల సంఘం నాయకులు కిరణ్‌కుమార్, ఆనంద్, మునిశేఖర్‌రాయల్, గుండాల గోపీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రమాద నష్టాల నివారణ



సదస్సులో మాట్లాడుతున్న బాబు

తిరుపతి(ఆటోనగర్)జూలై15: విద్యుత్ సంస్థలో షిఫ్ట్ ఆపరేటర్లు జాగ్రత్తలు పాటించి ప్రమాదాలు,నష్టాలను నివారించాలని విద్యుత్‌శాఖ తిరుపతి టౌన్ ఈఈ వాసుదేవరెడ్డి, ట్రాన్స్‌ఫార్మర్స్ డిప్యూటీ ఈఈ ఎస్.బాబు సూచించారు. టీటీడీ పరిపాలన భవనం ప్రాంగణంలోని విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో ప్రమాదాల నివారణపై సోమవారం సబ్‌స్టేషన్ల షిఫ్ట్ ఆపరేటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33 కేవీ సబ్‌స్టేషన్లలో సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో చిన్నలోపం వచ్చినా గుర్తించి మరమ్మతులు చేసుకోవాలన్నారు. ట్రిప్ అయిన వెంటనే సరిచేయాలన్నారు. సదస్సులో ఈఈ మహేశ్వర్‌రెడ్డి, డీఈఈలు ఎ.బాలాజీ,ఆంజనేయులు,కె.మునిప్రసాద్,ఏఈలుకె.మోహన్,పి.వెంకటరమణ,ఎస్. శ్రీనివాసులు,కె.హేమచంద్రారెడ్డి,ఎన్.రాము, కె.చంద్రమౌళి రెడ్డి, ఇ.మునిరామ్‌లతో పాటు ఆపరేటర్లు పాల్గొన్నారు.

తైక్వాండో బెల్ట్ పరీక్షలో ప్రతిభ



క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేస్తున్న దృశ్యం

తిరుపతి(క్రీడలు), జూలై 15: స్థానిక యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఏపీ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రాండ్ మాస్టర్ కె.వి.బాబారావు పర్యవేక్షణలో సోమవారం బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో నగరానికి చెందిన పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ, నైపుణ్యత ఆధారంగా వీరిలో కొందరికి బెల్ట్‌లు ప్రదానం చేశారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బాలకృష్ణన్, దామోదరం, నారాయణ, రెడ్డెప్ప, మునిలక్ష్మి, ముకేష్, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వారం రోజులుగా పనిచేయని ఏటీఎంలు

తిరుపతి(ఆటోనగర్), జూలై 15: స్థానిక ఎస్వీనగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలు వారం రోజులుగా పనిచేయడం లేదు. బ్యాంకు అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

రీజనల్ సైన్స్ సెంటర్లో రేపట్నుంచీ స్పేస్‌వీక్

మంగళం, జూలై 15 :తిరుపతి జూ పార్కు రోడ్డులోని రీజనల్ సైన్స్ సెంటర్‌లో ఈనెల 17నుంచి వారం రోజులపాటు స్పేస్‌వీక్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు కోఆర్డినేటర్ కోలా శ్రీనివాస నెహ్రూ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రునిపై మానవుడు కాలు మోపిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా సిద్ధం చేసిన నూతన ప్లానిటోరియం ప్రదర్శనను 17న ఉదయం 11గంటలకు నగర కమిషనర్ అదితిసింగ్ ప్రారంభిస్తారన్నారు. వివిధ వివిధ అంశాలపై క్విజ్, పెయింటింగ్, వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పేదలకు అన్నదానం



తిరుపతి అర్బన్, జూలై 15: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు జన్మదినం పురస్కరించుకుని సోమవారం మధ్యాహ్నం రుయా ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కల్లూరి నాగరాజగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్, మధుఆచారి, బాబుగౌడ్, సుబ్రహ్మణ్యం, జగదీష్, నాగేంద్ర, మహేష్, మురళి పాల్గొన్నారు.

ఎస్పీకి 70 ఫిర్యాదులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 15 : జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఎస్పీ సుబ్బరాయుడు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 70 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజల నుంచి ఎస్పీ అర్జీలను స్వీకరించారు. వీటిని సంబంధిత అధికారులకు పంపి తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. తమ కార్యాలయానికి రాలేని వారు సంబంధిత సీఐ కార్యాలయాల్లో ఫిర్యాదులు అందజేయాలన్నారు. అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

నేడు ఐచ్ఛిక సెలవు

తిరుపతి(విద్య), జూలై 15: మొహరం సందర్భంగా మంగళవారం ఐచ్ఛిక సెలవుగా ఉపయోగించుకునేందుకు విద్యాశాఖ అనుమతించింది. జిల్లా విద్యాశాఖాధికారి ఈమేరకు జిల్లాలోని మండల విద్యాశాఖాధికారులకు, అన్ని యాజమాన్య పాఠశాలలకు సమాచారం తెలియజేశారు.

ఐఐటీ మెడికల్ ఫౌండేషన్ మెటీరియల్ సిద్ధం

తిరుపతి(విద్య), జూలై 15: కోటా ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్‌లో సీటు సాధనకు మెటీరియల్ సిద్ధం చేసినట్లు నీట్ కోటా పేజెస్ ఓ ప్రకటనలో తెలిపింది. 6,7,8,9,10 తరగతుల విద్యార్థులకు కోటా ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ డిజిటల్ స్టడీ మెటీరియల్, అసైన్‌మెంట్ల మెటీరియల్ అందించనున్నట్లు పేర్కొంది. మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టులకు సంబంధించి ఫౌండేషన్ మెటీరియల్‌ను డిజిటల్ మొబైల్ వెర్షన్‌లో వాట్సప్ ద్వారా పొందొచ్చన్నారు. మరింత సమాచారం కోసం ఐఐటీఎఫ్, ఎంఈడీఎఫ్ అని టైప్‌చేసి వాట్సప్ నంబర్ 9894016661కు మెసేజ్ చేయాలని సూచించారు.

శ్రీనివాసపురంలో బంగారు నగల చోరీ

తిరుపతి(నేరవిభాగం), జులై 15: తిరుపతి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని శ్రీనివాసపురంలో చోరీ జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు....శ్రీనివాసపురానికి చెందిన సులోచన వారం రోజుల క్రితం బెంగళూరులో ఉంటున్న కుమార్తె ఇంటికి వెళ్ళింది. సోమవారం తిరిగి రాగా తాళాలు పగులగొట్టి లోపల వస్తువులు చిందరవందరగా కనిపించాయి. బీరువాలోని వెండి, బంగారు నగలు కనపడలేదు. ఎంఆర్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుల కోసం గాలిస్తున్నామని ఎస్ఐ షేక్ షావలి చెప్పారు.

నగలు అప్పగించని న్యాయవాదిపై ఫిర్యాదు

తిరుపతి(నేరవిభాగం), జూలై 15: నగలు అప్పగించని న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని రేణిగుంట మండలం బంగారయ్య కండ్రిగకు చెందిన పచ్చూరు విశ్వనాథం సోమవారం ఎస్పీ సుబ్బరాయుడును కలసి వినతి పత్రం సమర్పించారు. తమ కుమారుడు పార్థసారథికి కౌముదితో పెళ్లి చేశామన్నారు. కొద్ది రోజులకే విడిపోయారన్నారు. పెద్దల సమక్షంలో నిర్ణయించుకున్న విధంగా నగదు, బంగారం, కట్నం, కానుకలు పూర్తిగా అందజేశామన్నారు. ఈ క్రమంలోనే రెండు ఉంగరాలు, సరుడు చైను అమ్మాయి తల్లిదండ్రులకు చేర్చాలని న్యాయవాది రాంబాబుకు అందచేశామన్నారు. న్యాయవాది నగలు చేర్చలేదన్నారు. బాధితునికి న్యాయం చేయాలని రేణిగుంట డీఎస్పీని ఎస్పీ ఆదేశించారు.

అల్లుడి దాడిలో చినమామ మృతి

తిరుపతి(నేరవిభాగం), జులై 15 అల్లుడి దాడిలో చినమామ మృతి చెందిన ఘైనమిది. అలిపిరి ఎస్ఐ రాజశేఖర్ కథనం మేరకు....కదిరికి చెందిన సురేష్ బతుకుతెరువు కోసం తిరుపతి వచ్చాడు. ఇక్కడే అతనికి పెళ్లయింది. ఇతని చినమామ శ్రీనివాసులు నగరంలోనే ఆటో నడుపుతుంటాడు. కొద్ది రోజులుగా భార్యా, భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. చినమామ కూడా తన పట్ల మర్యాద లేకుండా ప్రవర్తిస్తున్నాడని సురేష్ భావించేవాడు. దీంతో తరచూ వీరిద్దరూ తగాదా పడేవారు. ఈ నేపధ్యంలో జీవకోన అంబేడ్కర్ సర్కిల్ వద్ద సోమవారం గొడవ పడ్డారు. ఈక్రమంలో సురేష్ బలంగా దాడి చేసి తీవ్రంగా కొట్టాడు. అప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని చెల్లెలు సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శవాన్ని రుయాకు తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రేపు కురుబ ప్రజాప్రతినిధులకు సన్మానం

తిరుపతి(ఆటోనగర్)జూన్15: ఎన్నికల్లో గెలిచిన తమ సామాజిక వర్గ ఎంపీ,ఎమ్మెల్యేలను బుధవారం తనపల్లి ఎస్పార్ కన్వెన్షన్ హాలులో కురుబ,కురువ,కుమార సంఘం అధ్వర్యంలో సన్మానించనున్నామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సన్మాన కార్యక్రమానికి జిల్లాలోని తమ సంఘం సభ్యులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.98 కోట్లు

తిరుమల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.98 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 84,797 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 29,497 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ కృష్ణా ఎల్లా, ఎండీ సుచిత్ర ఎల్లా దంపతులు, మాజీ మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, తిరుపతి ఎంపీ గురుమూర్తి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.



విజయవాడలో సోమవారం జరిగిన జనసేన ప్రజాప్రతినిధుల సమావేశంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును సన్మానించి కూరగాయల బుట్ట అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

సారథి లేక సతమతం

వెటర్నరీ వర్సిటీ వీసీ నియామకంలో జాప్యం



వెటర్నరీ వర్సిటీ పరిపాలనా భవనం


తిరుపతిరూరల్,జూలై15: ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి ఏడాదిగా రెగ్యులర్ వీసీని నియమించకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా తయారైంది. గత ఏడాది ఆగస్టులో వీసీ డాక్టర్ పద్మనాభరెడ్డి పదవీకాలం ముగిసింది. తిరిగి ఆయన్నే వీసీగా నియమించేందుకు గత వైసీపీ పాలకులు ప్రయత్నించారు. నియామకంలో యూజీసీ నిబంధనలు పాటించాలని కొందరు ప్రొఫెసర్లు హైకోర్టులో కేసువేశారు. పద్మనాభరెడ్డి నియామకానికి బ్రేక్‌పడింది. అప్పటి నుంచి పశుసంవర్ధకశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది ఇన్‌చార్జిగా కొనసాగారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయన వీసీ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. అప్పటికే ద్వివేది వద్ద దాదాపు 60కిపైగా ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఏచిన్న పని మంజూరు కావాలన్నా అధికారులు అమరావతి వెళ్లాల్సి వస్తోంది. గత ప్రభుత్వం జీతాలకు తప్ప మరే ఇతర పనులకూ బడ్జెట్ కేటాయించలేదు. ఫామ్‌లోని పశుదాణాకూ నిధుల కొరత ఏర్పడింది. న్యాయస్థానంలో కేసు నడుస్తుండడంతో ఇప్పటికిప్పుడు రెగ్యులర్ వీసీని నియమించే అవకాశం లేదని వర్సిటీవర్గాలు భావిస్తున్నాయి.

ఇన్‌చార్జుల పాలనలోనే..

వర్సిటీలో ప్రస్తుత అధికారులకే కొన్ని పోస్టుల అదనపు బాధ్యతలు అప్పగించారు. కీలకమైన రెగ్యులర్ రిజిస్ట్రార్ పదవీకాలం గత నెలాఖరుతో ముగిసింది. సీవోఈను ఎఫ్ఏసీ రిజిస్ట్రార్‌గా నియమించారు. డెయిరీసైన్స్ డీన్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్(డీఆర్)లు ఇద్దరూ గతనెలలో రిటైరయ్యారు. వెటర్నరీ డీన్‌కి డెయిరీసైన్స్ డీన్‌గా అదనపు బాధ్యతలు, హెచ్‌వోడీగా పనిచేసే సీనియర్ ప్రొఫెసర్‌కి ఇన్‌చార్జి డీఆర్ బాధ్యతలు కేటాయించారు. మూడేళ్ల పదవీకాలం పూర్తయిన డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ పోస్టును ఇన్‌చార్జి డీఆర్ (సీనియర్ ప్రొఫెసర్)కు అదనంగా అప్పగించారు. ఇన్‌చార్జి వీసీని నియమించి ఆఫీసర్ల పోస్టులను త్వరితగతిన భర్తీచేసి పాలన గాడిలో పెట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో చొరవ

అధికారులకు జేసీ ఆదేశం



అర్జీదారుల సమస్యలు వింటున్న జేసీ ధ్యానచంద్ర

తిరుపతి(కలెక్టరేట్), జూలై 15: అర్జీదారుల సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు జేసీ, డీఆర్వో, అధికారులకు వినతులు అందజేశారు. అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని జేసీ ఆదేశించారు. 131 అర్జీలు అందాయని కలెక్టరేట్ అధికారులు తెలిపారు. రెవెన్యూకు సంబంధించి 94 వినతులు రావడం గమనార్హం. డిప్యూటీ కలెక్టర్లు కోదండరామిరెడ్డి, రామ్మోహన్‌తో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగం

రేణిగుంట మండలంలో పలు పంచాయతీల్లో ప్రజాప్రతినిధులతో అధికారులు కుమ్మక్కై సుమారు రూ.2కోట్ల వరకు దుర్వినియోగానికి పాల్పడ్డారు. పనులు జరగకుండానే ఖర్చు చూపడం.. ఒకే పనికి రెండు సార్లు బిల్లులు పెట్టడం లాంటివి చేశారు. ప్రభుత్వ సొమ్ము దుబారా చేశారు. నిధులు దారి మళ్లించారు.

- దేవేంద్రనాథ్‌రెడ్డి,కొత్రమంగళం

వైసీపీ నేత ఇల్లు కూల్చేశారు

మా స్థలంలో ఇల్లుకట్టుకుంటే ఆదివారం రాత్రి వైసీపీ నేత ప్రతాప్‌రెడ్డి మరో 15మంది అనుచరులు దౌర్జన్యంగా ధ్వంసం చేశారు. అడ్డుకుంటే దాడి చేశారు. గతంలోనూ ఇబ్బందులకు గురిచేశారు. - పుష్పావతి, బాకరాపేట

నష్టపరిహారం ఇప్పించండి

చంద్రగిరి మండలం తొండవాడ గ్రామ లెక్కదాఖల్లో సర్వే నెంబరు. 557/2బి1లో నాకు ప్లాట్ ఉంది. ఆ భూమి జాతీయ రహదారికి పోతోంది. అధికారులు ఈ భూమికి నష్టపరిహారం ఇప్పించాలి. **- కుమారి, తిరుపతి**

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో

కార్పొరేటర్లే ఫిర్యాదుదారులు



కమిషనరుకు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ నరసింహ ఆచారి

తిరుపతి, జూలై15(ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఏర్పాటుచేసిన వేదికలో కార్పొరేటర్లే ప్రధాన ఫిర్యాదుదారులుగా మారారు. తమ డివిజన్ల సమస్యలను వారు మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అదితిసింగ్‌ల దృష్టికి తీసుకొచ్చారు. ఎక్కువ సమయం వీరికే సరిపోవడంతో సామాన్య ప్రజలకు సమయం లేకుండా వెనుతిరిగే పరిస్థితి కనిపించింది. కార్పొరేటర్లు వారి సమస్యలను చెప్పుకునేందుకు మేయర్, కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లే వెసులుబాటు ఎప్పుడైనా ఉంటుంది. అలాకాకుండా ఫిర్యాదుల వేదికను వినియోగించుకోవడం విమర్శలకు తావిస్తోంది. ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, డీసీ అమరయ్య, ఎస్ఈ మోహన్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఆర్వోలు సేతు మాధవ్, కె.ఎల్.వర్మ, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, ఏడీసీ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

- గడిచిన మూడేళ్లలో జరిగిన పనులపై విచారణ జరిపించాలని, గరుడవారధి నిర్మాణ సంస్థ ఆఫ్కాన్స్ వారధి కింద చేపట్టాల్సిన పనులు అసంపూర్తిగా వదిలేశారని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ ఫిర్యాదు చేశారు.
- తహసీల్దార్ కార్యాలయం, జీఎస్టీ ఆఫీస్, ఏ.ఆర్ పోలీస్‌గ్రౌండ్, భాష్యం స్కూల్ ప్రాంతాల్లో కొత్తగా రోడ్లు, కాలువలు నిర్మించాలని 19వ డివిజన్ కార్పొరేటర్ ఆరణి సంధ్య కోరారు.
- రాయలచెరువు రైల్వే బ్రిడ్జి వద్ద రెండు కాలనీలు కలిపే రోడ్డు నిర్మాణం టెండరు పూర్తయినా ఇప్పటివరకు పనులు పూర్తికాలేదని 25వ డివిజన్ కార్పొరేటర్ నరసింహాచారి పేర్కొన్నారు.
- .చిన్న బజారు వీధి, జ్యోతి థీయేటర్ సర్కిల్, బొమ్మగుంట, ఐ.ఎస్.మహల్ సర్కిల్ ప్రాంతాల్లో కాలువలు పూర్తిగా పాడైపోయాయ 31వ డివిజన్ కార్పొరేటర్ సి.కె.రేవతి వినతిపత్రంలో పేర్కొన్నారు

డైలీ పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించండి

రోజూ ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని సచివాలయ సిబ్బందిని మేయర్ శిరీష ఆదేశించారు. సోమవారం తన చాంబరులో ఆమె వార్డు సచివాల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పరిశుభ్రత పాటించాలని తెలియజేయాలన్నారు. వర్షాకాలంలో డయేరియా, మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా వంటి రోగాల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ముడిసరుకుల నాణ్యత పరిశోధనకు

తిరుమలలో ప్రత్యేక పరిశోధనా కేంద్రం

తిరుమల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు టీటీడీ అందిస్తున్న అన్నప్రసాదాల ముడి సరుకులు మరింత నాణ్యతతో కొనుగోలు చేసేందుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ ఆఫ్ ఇండియా) వారి సహకారం తీసుకోవాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. అలాగే వారి సహకారంతో తిరుమలలో అత్యాధునిక పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో సోమవారం ఆయన ఎఫ్ఎస్ఎస్ఏఐ, టీటీడీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. ఆహార పదార్థాల్లో వినియోగించే ముడి సరుకులను టెండర్ల ద్వారా టీటీడీ కొనుగోలు చేస్తోందన్నారు. వీటి నాణ్యతను పెంచేందుకు అత్యాధునికమైన పరిశోధనా కేంద్రాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సహకారంతో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. తిరుమలలో భక్తులకు అందిస్తున్న జల ప్రసాదం నాణ్యత, వంటశాలలను ఎప్పటికప్పుడు పరీక్షిస్తున్నట్లు తెలిపారు. ముడిసరుకుల కొనుగోలుకు సంబంధించి ఎస్ఓపీని తయారు చేయాలని జేఈవోను కోరారు. అన్నప్రసాద భవనంలో పనిచేసే సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. తిరుమలలో ప్రత్యేకంగా ఎఫ్ఎస్ఎస్ఏఐ ల్యాబ్‌ను ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలాన్ని ఇవ్వాలని జేఈవోను ఆదేశించారు. న్యూఢిల్లీకి చెందిన ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈవో కమలవర్ధన్‌రావు ఆదేశాల మేరకు ఫుడ్ సేఫ్టీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు ఈసందర్భంగా తిరుమలలో భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదాలు, జలప్రసాదం తదితర అంశాలపై జాగ్రత్తలను, నాణ్యత పెంచడానికి అవసరమైన సూచనలను ఈవోకు వివరించారు. జేఈవో గౌతమి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అండ్ ఫాస్ట్ ట్రాక్ నోడల్ అధికారి రవీంద్రారెడ్డి, ఎఫ్ఎస్ఎస్ఏఐ డిప్యూటీ డైరెక్టర్ బాలు నాయక్, టీటీడీ సీఈవో నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

పౌరసరఫరాలశాఖకు సిబ్బంది కొరత

తిరుపతి(నేరవిభాగం), జూలై 15: జిల్లా సివిల్ సప్లయిస్ శాఖను సిబ్బంది కొరత వేధిస్తోంది. జిల్లా కార్యాలయంలో పౌర సరఫరాలశాఖాధికారితో పాటు ఏఎస్ఓ పనిచేస్తున్నారు. వీరి పరిధిలో 20 మంది డిప్యూటీ తహసిల్దార్లు ఉన్నారు. వీరంతా గోడౌన్లు, రేషన్ షాపులు, పెట్రోలు బంకులు, గ్యాస్ ఏజెన్సీలను నిరంతరం తనిఖీ చేయాలి. కానీ వీరంతా కలెకరేట్‌లో పనిచేస్తున్నారు. దీంతో ఈ శాఖ గాడి తప్పింది. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఎక్కడున్నారో తెలియని పరిస్థితి. జిల్లాలో 1200 పెట్రోలు బంకులు, 1500 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటిని నెలకోసారి తనిఖీ చేయాలి. కొందరు రిజిస్టర్లు కార్యాలయానికే తెప్పించుకుని తనిఖీలు చేసినట్లు సంతకాలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పెట్రోలు, డీజెల్ కల్తీపై నిఘా, పర్యవేక్షణ కొరవడింది. ఆఫీసులో ఉన్న ఒకే ఒక్క జూనియర్ అసిస్టెంట్ జీతాలు బిల్లులు రాయడం, ఇతరత్రా కార్యాలయ పనులకే పరిమితమవుతున్నారు. కంప్యూటర్ ఆపరేటర్ లేరు. ప్రైజ్ మానటరింగ్ చేస్తున్న సిబ్బంది చిత్తూరు, తిరుపతికి కలిపి ఒకరే ఉన్నారు. తక్షణమే అవసరమైన సిబ్బందిని నియమించి కీలకమైన ఈ వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన అవసరముంది.

స్మార్ట్‌సిటీ నిధుల వ్యయంపై విచారణ జరిపిస్తాం : బీజేపీ

తిరుపతి(ఆటోనగర్)జూలై15: స్మార్ట్‌సిటీ నిధుల వ్యయంలో జరిగిన అవినీతిపై కేంద్ర విజిలెన్స్‌తో సమగ్ర విచారణ జరిపిస్తామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ స్మార్ట్ సిటీలో మౌలిక సదుపాయాలకు రూ.1600 కోట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. గత ఐదేళ్లలో పాలకులు, అధికారులు చేసిన అభివృద్ధి పనులకు వినియోగించిన ఈ నిధుల్లో భారీగా దుర్వినియోగం జరిగిందన్నారు. వినాయక సాగర్ అభివృద్ధి పనుల్లో లక్షల రూపాయల మేర అవినీతి జరిగిందన్నారు. ఈ పనులకు రూ 12కోట్ల అంచనాతో ప్రారంభించారన్నారు. కానీ రూ.55 కోట్లకు అంచనా పెంచి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. కొన్ని పనులు పూర్తి చేయకుండానే నిధులు కాజేశారని విమర్శించారు. రోడ్లు అభివృద్ధి చేశామంలూ కాలువలు నిర్మించకుండా రూ. కోట్లు దోచుకున్నారన్నారు. శ్రీనివాస సేతు వంతెన నిరుపయోగంగా మారుతోందన్నారు. స్మార్ట్ సిటీ పనుల్లో అవినీతిపై కేంద్ర విజిలెన్స్ అధికారులతో సమగ్ర విచారణ జరిపిస్తామని పేర్కొన్నారు సమావేశంలో నాయకులు అజేయ్ కుమార్,వరదరాజులు,శ్రీహరిరావు,పి.భాస్కర్,కిరణ్,నవీన్ పాల్గొన్నారు.



సంస్కృత వర్సిటీకి న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్

తిరుపతి రూరల్, జూలై 15: తిరుపతిలోని జాతీయ సంస్కృతవర్సిటీకి న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ లభించింది.వర్సిటీలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రీయ సంస్కృతవిద్యాపీఠానికి 2020లో జాతీయవర్సిటీ హోదా లభించగా..మూడేళ్లకాలంలోనే న్యాక్ ఏప్లస్ గ్రేడ్ సాధించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అధ్యాపకులు, సిబ్బంది సమన్వయంతో దీన్ని సాధించగలిగామని, తద్వారా భవిష్యత్‌లో ఎన్నో కొత్త కోర్సులు, ప్రాజెక్టులు, విద్యాకార్యక్రమాలు, పరిశోధనలకు మంచి అవకాశం ఉంటుందని తెలిపారు. సంస్కృతభాషను, భారతీయసంస్కృతిని ప్రజలకు చేరువచేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ, అకడమిక్ డీన్ రజనీకాంత శుక్లా, ఐక్యూఏసీ డైరెక్టర్ సతీశ, పీఆర్వో వి.రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రీజనల్ సైన్స్ సెంటర్లో రేపట్నుంచీ స్పేస్‌వీక్

మంగళం, జూలై 15 :తిరుపతి జూ పార్కు రోడ్డులోని రీజనల్ సైన్స్ సెంటర్‌లో ఈనెల 17నుంచి వారం రోజుల పాటు స్పేస్‌వీక్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు కోఆర్డినేటర్ కోలా శ్రీనివాసనెహ్రూ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రునిపై మానవుడు కాలుమోపిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా సిద్ధం చేసిన నూతన ప్లానిటోరియం ప్రదర్శనను 17న ఉదయం 11 గంటలకు నగర కమిషనర్ అదితిసింగ్ ప్రారంభిస్తారన్నారు. వివిధ వివిధ అంశాలపై క్విజ్, పెయింటింగ్, వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పెద్దిరెడ్డి ఇసుక నిల్వలపై కొనసాగుతున్న దాడులు

- అడివిచెరువు మార్గంలోని 2202 క్యూబిక్ మీటర్ల ఇసుక సీజ్
- 3303 టన్నులు.. విలువ రూ.13 లక్షలు



ములకలచెరువు, జూలై 15: అన్నమయ్య జిల్లా ములకల చెరువు మండలంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పోగు చేసిన ఇసుక నిల్వలపై దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా సోంపల్లె పంచాయతీ అడివిచెరువు మార్గంలోని ఇసుక నిల్వలను సోమవారం అధికారులు సీజ్ చేశారు. మదనపల్లె డివిజినల్ గనులు, భూగర్భ శాఖ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, సర్వేయర్ దుర్గాదేవి, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎస్ఈబీ సీఐ రామ్మోహన్, ఎస్ఐ తిప్పేస్వామి, ఆర్ఐ వీరాంజనేయులు తదితరులు ఇసుక నిల్వలను పరిశీలించారు. ఇక్కడున్న ఇసుక నిల్వలు 2202 క్యూబిక్ మీటర్లుగా గుర్తించారు. 3303 టన్నులు ఉన్న ఇసుక విలువ రూ.13 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. కాగా ములకలచెరువు మండలం సోంపల్లె పంచాయతీ రెడ్డివారిపల్లె సమీపంలో ఇటీవల పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పోగు చేసిన రూ.17 కోట్ల విలువైన 41 వేల టన్నులు ఉన్న ఇసుక కొండలను సీజ్ చేసిన విషయం విదితమే. వైసీపీ ప్రభుత్వ పాలనలో పెద్దతిప్పసముద్రం మండలం టి.సదుం సమీపంలోని సంగమేశ్వర స్వామి ఆలయం సమీపంలోని పాపాఘ్ని నుంచి ఈ ఇసుకను ఇక్కడికి తరలించారు. ఈ ఇసుక కొండలపై కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాలతో ఇటీవల అధికారుల బృందం సీజ్ చేశారు. ఈ ఇసుకకు సంబంధించి కూడా గనులు, భూగర్భశాఖ అధికారులు హైదరాబాదుకు చెందిన కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తంబళ్లపల్లె నియోజకవర్గంలో పోగు చేసిన ఇసుక నిల్వలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఐదేళ్లు పట్టించుకోకపోవడం వల్లే ఈ దుస్థితి

- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ
- అస్వస్థతకు గురైన విద్యార్థులకు ఆస్పత్రిలో పరామర్శ

సూళ్లూరుపేట, జూలై 15: ఐదేళ్ల వైసీపీ పాలనలో గురుకులాలను, వసతి గృహాలను పట్టించుకోకపోవడం వల్లే నేడు ఇలాంటి పరిస్థితులకు దారి తీస్తున్నాయని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. కనీసం గురుకులంలో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు కూడా జీతాలు చెల్లించ లేని దౌర్భాగ్యస్థితిలో పాలన సాగడం సిగ్గుచేటన్నారు. నాయుడుపేట అంబేడ్కర్ గురుకులంలో నిల్వ ఆహారం తిని అస్వస్థకు గురై సూళ్లూరుపేటలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆమె మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యంతో కలిసి పరామర్శించారు. అక్కడ వైద్యులను విద్యార్థుల ఆరోగ్య పరిస్థితితులను అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఇలాంటి ఘటన జరగడం బాధాకరమని ఇలాంటివి పునరావృత్తం కాకుండా చూస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో గురుకులాలను పట్టించుకోలేదని అక్కడ పరిసరాలు, మరుగుదొడ్లు, వంట చేసే ప్రదేశం చూస్తేనే అర్థమవుతుందన్నారు. ఇక గురుకులం భవనాలు, పరిసరాలు, మరుగుదొడ్లు శుభ్రం చేయడానికి సహా విద్యార్థులకు సంఖ్యకు అనుగుణంగా పారిశుధ్య సిబ్బంది లేరన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల ఇలాంటి పరిస్థితి వచ్చిందని ఇక పై అలాంటివి జరగకుండా గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం పెట్టే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. గురుకులంలో ప్రిన్సిపాల్, వార్డెన్ పర్యవేక్షణ లేకపోవడంతో నిల్వ ఆహారం పెట్టిన వల్ల విద్యార్థులకు అస్వస్థతకు గురయ్యారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి టి.సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, నాయకులు కె.పెంచలయ్య, బుజ్జిబాబు, డి.రవి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా విద్యాలయాలు





మద్యం బాటిళ్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణం - సీసా పెంకులతో నిండిన క్రాస్ రోడ్డు వద్ద ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం

వెంకటగిరి, జూలై 15: వెంకటగిరిలో సరస్వతీ మాత కొలువు దీరిన ప్రభుత్వ విద్యాలయ, కళాశాల ప్రాంగణాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. రాత్రీపగలూ తేడా లేకుండా ఆకతాయిలు విద్యాలయాలు, కళాశాలల క్రీడా ప్రాంగణాల్లో మద్యం తాగుతుండడంతో బెల్టు షాపులను తలపిస్తున్నాయి. అదేవిధంగా క్రీడా ప్రాంగణాల్లో మద్యం బాటిళ్లను పగల గొట్టడంతో క్రీడాకారులు, వాకింగ్ చేసే వారికి ఇబ్బంది తప్పడం లేదు. ఈ విషయంపై ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని తెలుస్తోంది. నియంత్రించాల్సిన పోలీసులూ పట్టించుకోవ డంలే లేదనే విమర్శలున్నాయి. సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.

పీర్లచావిడిలో కురుగొండ్ల ప్రార్థనలు



పీర్లు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో కురుగొండ్ల తదితరులు

వెంకటగిరి, జూలై 15 : మోహర్రంను పురస్కరించుకుని పట్టణంలోని పీర్లాదిపేటలో ముస్లిం లు సోమవారం నిర్వహించిన పీర్ల చావిడి కార్యక్రమంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీడీపీ హయాంలోనే మసీదులు, ప్రార్థనా మందిరాలను అభివృద్ధికి నోచుకున్నాయన్నారు. తమ ప్రభుత్వం ముస్లింలకు అండగా నిలుస్తుందన్నారు. గతంలో టీడీపీ హయాంలో రంజాన్‌కి తోఫా కిట్లు అందచేశామని చెప్పారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేయండి

వెంకటగిరిటౌన్, జూలై 15: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేయాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య అన్నారు. సోమవారం 8వ సచివాలయంలో స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం వచ్చే ప్రజలకు భరోసా ఇవ్వాలన్నారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు.

పాత జీఎన్‌టీ రోడ్డులో ఇరుక్కుపోయిన భారీ వాహనం



నాయుడుపేట టౌన్, జూలై 15: నాయుడుపేట - శ్రీకాళహస్తి పాత జీఎన్‌టీ రోడ్డు పాత ట్రెజరీ సమీపాన సోమవారం భారీ లోడ్‌తో వస్తున్న లారీ ఆగిపోయింది. మేనకూరు సెజ్‌కు భారీ లోడ్‌తో వెళ్తుండగా లారీ రోడ్డుపై ఉన్నట్టుండి ఆగిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొద్దిపాటి చినుకులకే గుంతల్లో నీరుచేరి బురదమయంగా ఉండటంతో ద్విచక్రవాహన దారులు అవస్థలు పడాల్సి వచ్చింది.

మా భూములకు దారి చూపండి

పెళ్లకూరు, జూలై 15 : మండలంలోని చిల్ల కూరు నుంచి పెనల గుర్రప్పతోట వరకు దా రికి ఇరువైపుల ఉన్న పొలాలకు వెళ్లేందుకు దారి చూపాలంటూ ప లువురు రైతులు సోమ వారం పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. జాతీయ రహదారి నిర్మా ణంలో పొలాలకు ఇవతల నుంచి అవతలకు దాటే మార్గం లేకుండా పోయిందన్నారు. దీంతో పంటను గట్టుకు చేర్చుకోలేక అవస్థలు పడుతున్నామని తహసీల్దార్ ప్రసాదరావుకు వినతిపత్రం అందించారు.

రికార్డులు లేకుండానే బిల్లుల చెల్లింపు

ఉపాధి హామీ రికార్డుల తయారీలో తలమునకలైన సిబ్బంది

ప్రభుత్వం మారడంతో నీళ్లు నములుతున్న అధికారులు

ఎర్రావారిపాలెం, జూలై 15 : ఎర్రావారిపాలెం మండలంలో ఉపాధి హామీ పథకం అమలు మాయాజాలంతో స్థానిక ప్రజాప్రతినిధులకు కనక వర్షం కురిపించింది. ఏడాది లోపు జరిగిన పనులకు దాదాపు లక్షల్లో అధికారులు మండలంలో వలసల నివారణ పేరిట కూలీలకు చెల్లించేశారు. సాధారణంగా పనులు పూర్తిచేసిన అనంతరం రికార్డుల్లో నమోదైన పిమ్మట బిల్లులు చెల్లిస్తారు. నిబంధనలకు విరుద్ధంగా అధికారుల మాయాజాలంతో రికార్డుల్లో నమోదు చేయకుండానే నాయకులు అడిగిందే తడవుగా ఉపాధిహామీ అధికారులు డబ్బులు చెల్లించేశారు. అయితే చెల్లించిన డబ్బులకు ఎంతమేరకు బిల్లులు నమోదు చేయాలనే దాని కోసం గత 15 రోజులుగా రాత్రింబవళ్లు ఉపాధి సిబ్బంది కార్యాలయంలోనే తిష్టవేసి పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. వచ్చేది తమ ప్రభుత్వమేనని.. తాము చెప్పినట్లుగా పనులు చేయకుండానే కనీసం రికార్డుల్లో నమోదు చేయకుండా నేరుగా డబ్బులు చెల్లించేందుకు వెంటనే బిల్లులు పెట్టాలని గ్రామస్థాయి నాయకులు ఉపాధి హామీ మండల స్థాయి అధికారులతో కుమ్మక్కయ్యారు. ఇంకేముంది లక్షల్లో కూలీల పేరిట ప్రభుత్వ ధనాన్ని అప్పనంగా తమ సొంత జేబుల్లోకి వేసుకున్నారు. ప్రభుత్వం మారడంతో మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి హామి క్షేత్ర సహాయకులు 80 శాతం మంది తొలగింపబడ్డారు. వారి స్థానంలో కొత్త వారు బాధ్యతలు చేపట్టారు. కానీ ఏడాదిగా పనులు ఎంత మేర జరిగాయి.. ఎంత డబ్బు ఖర్చు అయిందనే వివరాలు సక్రమంగా లేకపోవడంతో ఆ రికార్డులు కొత్తగా నియమితులైన ఫీల్డ్ అసిస్టెంట్లకు అందజేయలేదు. పక్షం రోజులుగా మండల కార్యాలయంలో సమావేశాలు జరుగుతూనే ఉన్నాయి. రికార్డులు సక్రమంగా లేకపోవడంతో అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. చేయని పనులకు బిల్లులు డ్రా చేసుకుని తినేసిన మండల స్థాయి నాయకులు కొత్త ప్రతిపాదన తీసుకొస్తున్నారు. ఫారం పాండ్లు, ట్రెంచీల నిర్మాణంతో పాటు పండ్ల తోటల పెంపకం తాము చేపట్టామని, బిల్లులు అయిపోయిన తర్వాత రైతులు వాటిని లేకుండా చేశారని, ఈ విషయంలో సర్దుకుపోవాలని ప్రతిపాదన చేస్తున్నారు. వాస్తవంగా గతంలో జరిగిన పనులు ఉంటే ఏడాదిలోపే రైతులు మామిడి చెట్లను తొలగించడం, ఫారం పాండు, ట్రెంచ్‌లను పూడ్చడం వీలు పడేది కాదు. కానీ గతంలో జరిగిన అవినీతిని కప్పి పుచ్చుకునేందుకు ఈ విధమైన ప్రతిపాదనలు తెస్తున్నారని టీడీపీ నాయకులు ఎదురు తిరుగుతున్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం పైన ఉన్న ఉపాధి కార్యాలయంలో మండలంలోని కొత్త, పాత క్షేత్ర సహాయకులతో పాటు టీడీపీ నాయకులతో ఉపాధి సిబ్బంది విడతల వారీగా సమావేశమయ్యారు. ఈ సమావేశానికి గతంలో వైసీపీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు కూడా కొందరు హాజరై రాజీమార్గాలను సూచించారు. అయినా ప్రజాధనాన్ని దోచేసిన నాయకుల అవినీతి నిగ్గు తేల్చాలని కొంత మంది టీడీపీ నాయకులు పట్టుబడుతున్నారు. మండలంలో ఉపాధి బిల్లుల చెల్లింపు రికార్డులు తమ దగ్గర సిద్ధంగా లేవని, కొంత సమయం ఇస్తే పూర్తి చేస్తామని ఉపాధి హామీ పీఓ ఆశారాణి టీడీపీ నాయకులకు సర్దిచెబుతున్నారు. మండలంలో ఉపాధి హామీ పథకం అమలులో జరిగిన అవినీతి బయటపడుతుందా లేక లోలోన సర్దుకుంటారా అనేది మరి కొద్ది రోజులు వేచి చూడాల్సి ఉంటుంది.

- గతంలో ఘనకీర్తి నేడు అధోగతి

సీడీసీఎంఎస్‌లో లెక్కలేనితనం

- అక్రమాలకు సహకారం.. భారీగా నిధుల దుర్వినియోగం

జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (సీడీసీఎంఎస్)లో 'లెక్క'లేనితనం నెలకొంది. ఇక్కడి అవినీతిపై తరచూ పత్రికల్లో వార్తలు వచ్చినా అప్పటి మంత్రి పెద్దిరెడ్డి భయంతో సహకారశాఖ అధికారులు అటువైపు చూడలేదు. వైసీపీ ఐదేళ్ల కాలంలో ఆ పార్టీ నేత సహదేవరెడ్డి రెండేళ్లు, ఆయన సతీమణి నాగలక్ష్మి మూడేళ్లు పాలకవర్గం చైర్మన్లుగా వ్యవహరించారు. 2019 వరకు టీడీపీ హయాంలో చైర్మన్‌గా ఉన్న శ్యామరాజు వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీలో చేరిపోయారు. వైసీపీ హయాంలో సెవెన్‌మెన్ కమిటీ పాలకవర్గం జేబులు నింపుకోవడానికే ప్రాధాన్యమిచ్చిందన్న ఆరోపణలున్నాయి. దీంతో సొసైటీ నష్టాల్లో మునిగిపోయింది.

- చిత్తూరు కలెక్టరేట్




చిత్తూరులోని సీడీసీఎంఎస్ ప్రధాన కార్యాలయ భవనం

1943లో చిత్తూరు హోల్‌సేల్ కో-ఆపరేటివ్ స్టోర్ లిమిటెడ్‌గా ఏర్పడి, ఆ తర్వాత 1956లో సీడీసీఎంఎస్ పేరిట రిజిస్టర్ చేసుకుని వ్యాపారం ప్రారంభించింది. రైతులకు సేవలందించడంలో డీసీసీబీ, సీడీసీఎంఎస్‌లదే కీలక పాత్ర. డీసీసీబీ ద్వారా రైతులకు రుణాలిస్తే.. సీడీసీఎంఎస్ ద్వారా ఎరువులు ఇస్తున్నారు. అదే సమయంలో సీడీసీఎంఎస్ సంస్థ ఇతర ప్రభుత్వ సంస్థలకు సేవలందిస్తూ 82 ఏళ్లుగా ఆదాయాన్ని సమకూర్చుకుంటూ వస్తోంది. నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, జిప్సమ్, ఎరువులు, క్రిమిసంహారక మందుల అమ్మకాలు, వేరుశనగ విత్తనకాయల అమ్మకాలు, ధాన్యం కొనుగోళ్లు నిర్వహించి గతంలో ఉత్తమ సహకార సంస్థగా పేరు పొందింది. గతంలో టీటీడీలో లడ్డూ తయారీకి అవసరమైన పప్పు దినుసులను లాభాపేక్ష లేకుండా సీడీసీఎంఎస్ సరఫరా చేసింది. 1955, 1962లో తిరుపతి ఎమ్మెల్యేగా ఉంటూ, టీటీడీ బోర్డు సభ్యుడిగా కొనసాగిన రెడ్డివారి నాదమునిరెడ్డి జోక్యంతో ఇదంతా జరిగింది. అటువంటి ఘనకీర్తి కలిగిన సహకార సంస్థ తీరు కొన్నేళ్లుగా వివాదాస్పదంగా మారింది. మంచి పేరు మసకబారి నేడు అధోగతి పాలైంది.

ఆస్తులు ఆక్రమణలకు గురవుతున్నా...

గతంలో సీడీసీఎంఎస్ పరిధిలో 10-12 డిపోలు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య ఆరుకు పడిపోయింది. వాయల్పాడు డిపో భవనం మధ్యలో రాగిచెట్టు మొలిచినా, దానిని తొలగించలేదు. దాదాపు అన్ని డిపోల్లోనూ ఇంచుమించు ఇవే పరిస్థితులున్నాయి. వేరుశనగ విత్తన అమ్మకాల ప్రక్రియ ఆర్బీకేలకు వెళ్లడంతో ఈ సంస్థ ఆదాయం పూర్తిగా తగ్గింది. బాడుగుల రూపేణా వస్తున్న రూ25లక్షలే ఉద్యోగులకు జీతాలిచ్చేందుకు ఆదుకుంటున్నట్లు సమాచారం.



పట్టించుకోకుండా వదిలేయడంతో వాయల్పాడు డిపో గోడౌన్‌లో పెరిగిన చెట్లు

నిధుల దుర్వినియోగం

సీడీసీఎంఎస్‌లో నిధుల దుర్వినియోగంపై అనేక ఫిర్యాదులున్నాయి. ఎంత ఆదాయం వస్తోంది? ఎంత ఖర్చవుతోందనే లెక్కలు తేలడం లేదు. శాఖల్లో ఎరువుల స్టాక్ వెరిఫికేషన్ జరగడం లేదు. శాఖల తనిఖీలు అసలుకే లేదు. సిట్టింగ్ ఫీజు ఇష్టారాజ్యంగా వాళ్లే పెంచుకుంటున్నారు. ఉద్యోగుల వద్ద ఉన్న ఔట్‌స్టాండింగ్ నిధుల వసూళ్లను మరచిపోయారు. ఆస్తులు, ఫర్నిచర్ రిజిస్టర్లు లేవు. ఈపీ (ఎగ్జిక్యూటివ్ పిటిషన్)లపై సంవత్సరాల తరబడి చర్యలు తీసుకోవడంలో పాలకవర్గం విఫలమైంది. గతంలో బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేసి రిటైరైన వెంకటమునిరెడ్డి స్వాహా చేసిన రూ2.34 లక్షల రికవరీ ఊసేలేదు.

కొనసా...గుతున్న విచారణ

2019 వరకు చైర్మన్‌గా పనిచేసిన శ్యామరాజు హయాంలో జరిగిన అక్రమాలపై విచారణ కొనసాగుతోంది. అగ్రిమెంటు రికార్డు ట్యాంపరింగ్ చేసినట్లు ఫిర్యాదులున్నాయి. శాంతిపురం సొసైటీలో బంగారు రుణాల్లో రూ.కోటి దుర్వినియోగంపై సహకారశాఖ అధికారులు ఏళ్ల తరబడి విచారణ చేస్తూనే ఉన్నారు. ఈయన హయాంలో లెక్కకు మించి అక్రమాలు జరిగాయని విమర్శలున్నాయి. వీటి నుంచి తప్పించుకునేందుకే ఆయన గత ప్రభుత్వ హయాంలో వైసీపీలో చేరినట్లు చెబుతున్నారు.

రూ.33 లక్షల బకాయిల వసూళ్లు గాలికి

సీడీసీఎంఎస్‌లో 2013 నుంచి రూ.33 లక్షల బకాయిలున్నాయి. గత ఐదేళ్లలో పాలకవర్గం బకాయి వసూళ్లపై దృష్టి పెట్టలేదు. వారిపై ఈపీ దాఖలు చేయకపోవడం పట్ల మతలబు ఏమిటో తెలియడం లేదు. వేరుశనగ విత్తనాలు, నవధాన్యాలను సింగిల్ విండోలు, ప్రైవేటు వ్యక్తుల ద్వారా అమ్మగా, దానికి సంబంధించిన రూ.33,98,500 బకాయిల వసూళ్లను 11 ఏళ్లుగా పట్టించుకోవడం లేదు. దీనికి వడ్డీ, అపరాదపు వడ్డీ, వడ్డీపై వడ్డీ అంతా కలిపితే రూ.50 లక్షలకు పెరిగే అవకాశం ఉంది. సింగిల్ విండోల వారీగా శాంతిపురం రూ.6.10 లక్షలు, శ్రీరంగరాజపురం రూ.3.67 లక్షలు, పుంగనూరు రూ.2.70 లక్షలు, గుడిపాల రూ.2.94 లక్షలు, కుప్పం 1.33 లక్షలు, ఐరాల రూ.59 వేలు, కొండ్రాజుకాల్వ రూ.63 వేలు, పూతలపట్టు రూ.76 వేలు, తవణంపల్లె రూ.7,700... రామసముద్రం, చౌడేపల్లి విండోల్లో ప్రైవేటు వ్యక్తుల నుంచి రూ.3.87 లక్షలు, పెద్దమండ్యం, మొలకలచెరువు విండోల్లో ప్రైవేటు వ్యక్తుల నుంచి రూ.2.59 లక్షల బకాయిలు ఉన్నాయి.

సీడీసీఎంఎస్‌కు జడ్పీ సాధారణ నిధులు

రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి సిఫార్సు మేరకు అప్పటి జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి 2020లో జడ్పీ సాధారణ నిధుల నుంచి 10శాతం.. రూ25లక్షలు విడుదల చేసి సీడీసీఎంఎస్ ప్రధాన కార్యాలయ మరమ్మతు పనులు చేశారు. ఇప్పటికీ ఆ పనులు చేసిన కాంట్రాక్టర్‌కు నిధులు పూర్తిగా విడుదల కాలేదు. 2014-19 నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐసీడీపీ-2 (ఇంటిగ్రేటెడ్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు-2) ద్వారా సీడీసీఎంఎస్‌కు రూ.6.60 కోట్లు వ్యాపారాభివృద్ధి నిమిత్తం ఇచ్చేందుకు ప్రాజెక్టు రిపోర్టు సిద్ధమైంది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు రిపోర్టును పక్కన పెట్టడంతో పైసా కూడా విడుదల కాలేదు.

వరుస నష్టాలు..

సహకార శాఖ ఆడిట్ అధికారులు తయారు చేసిన నివేదికల మేరకు సీడీసీఎంఎస్ వరుస నష్టాల్లో కూరుకుపోయింది. నివేదిక మేరకు చూసుకుంటే.. 2019-20లో రూ.43.13 లక్షలు, 2020-21లో రూ.15.98 లక్షలు, 2021-22లో రూ.16.30 లక్షల నష్టాల్లో ఉంది. తిరుపతిలో ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న సీడీసీఎంఎస్‌కి చెందిన హోటల్ స్థలం లీజు వ్యవహారంలో పాలకవర్గం తమ ఇష్టారాజ్యంగా నిబంధనలకు విరుద్ధంగా పెంచుకుంటోంది. లెక్కల్లో చూపేది కొంత, సొంత జేబుల్లో వేసుకునేది మరికొంతగా మారిందన్న ఆరోపణలున్నాయి.

పక్కదారి పట్టిన నిధులు

ఐదేళ్ల వైసీపీ పాలనలో సీడీసీఎంఎస్‌లో నిధులు పక్కదారి పట్టాయి. ఎరువుల వ్యాపారాన్ని అప్పటి ప్రభుత్వం ఆర్బీకేలకు మళ్లించడంతో వ్యాపారాభివృద్ధి కుంటుపడింది. నిబంధనలకు విరుద్ధంగా సిబ్బంది నియామకం, వారికి భారీగా జీతాలు చెల్లించడం, పలువురిని పర్మినెంట్ చేయడం వంటివి జరిగినట్లు తెలుస్తోంది. ఎరువులు, వేరుశనగ విత్తనాలు, జిప్సం విక్రయాల్లోనూ లెక్కలు తేలడం లేదని సమాచారం. వేరుశనగ, ఎరువుల విక్రయాల్లో ఎంతమేర జీఎస్టీ వసూలు చేశారో రికార్డులు లేవు.

లేని ఉద్యోగుల పేరిట జీతాల చెల్లింపు

చిత్తూరులోని ప్రధాన కార్యాలయంలో అకౌంటెంట్, అటెండర్ పోస్టులు లేకున్నా, వారున్నట్లు సృష్టించి ప్రతినెలా జీతాల రూపేణా రూ.25వేలు డ్రా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. 2019, 2020 సంవత్సరాల్లో కరోనా ఉధృతంగా ఉండి ఎవరూ ఇళ్ల బయటకు రాలేదు. ఆ సమయంలో పాలకవర్గ చైర్మన్ చిత్తూరుకు వచ్చి వెళ్తున్నట్లు, అద్దె కారుకు నెలకు రూ.35 వేలు చెల్లించినట్లు రికార్డులో చూపారు. ప్రస్తుత బిజినెస్ మేనేజర్ ఏ బ్రాంచ్‌నూ తనిఖీ చేసిన దాఖలాల్లేవు. రికార్డులను లోతుగా పరిశీలిస్తే ఇలాంటి ఎన్నో అక్రమాలు బయటపడే అవకాశాలున్నాయి.

భక్తజన సంద్రంగా ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తి, జూలై 15: శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. సోమవారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 28వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇదులో రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,496మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 2,526మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,731మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,114, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 291మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 223మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 50మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 25,082 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.


క్యూలైన్లలో నిరీక్షిస్తున్న భక్తులు

ఆకట్టుకున్న మత్స్య యంత్రచ్ఛేదనం

శ్రీకాళహస్తి, జూలై 15: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మత్స్య యంత్రచ్ఛేదనం ఘట్టం నిర్వహించారు. ద్రౌపది స్వయంవరం సందర్భంగా ఏర్పాటు చేసిన మత్స్య యంత్రాన్ని అర్జునుడు ఛేదిస్తాడు. అనంతరం అర్జునుడికి అభిషేకాలు నిర్వహించి విశేష అలంకారం చేశారు. చప్పరంపై అధిష్టించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సుందర ఘట్టాలు భక్తులను ఆకట్టుకుంది.


పురవీధుల్లో ఊరేగుతున్న అర్జునుడు

ఏర్పేడు దుర్ఘటనపై స్పందించిన మంత్రి

ఏర్పేడు, జూలై 15: ఏర్పేడు మండలం అముదూరు క్రాస్ వద్ద ఆదివారం జరిగిన దుర్ఘటనపై రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి స్పందించారు. రీజనల్ జేటీసీ బసిరెడ్డితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మంత్రి ఆదేశాల మేరకు జేటీసీ బసిరెడ్డి, శ్రీకాళహస్తి మోటారు వాహన తనిఖీ అధికారి దామోదర నాయుడు ప్రమాద స్థలాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బసిరెడ్డి మాట్లాడుతూ డ్రైవర్ అతివేగంగా వాహనం నడపడం వల్ల ప్రమాదం జరిగినట్లు తెలుస్తోందన్నారు.

తల్లికూతుళ్ల మృతదేహాల అప్పగింత

ఏర్పేడు మండలం అముదూరు క్రాస్ వద్ద ఆదివారం రాత్రి లారీ ప్రమాదంలో మృతి చెందిన తల్లి శారద, కుమార్తె వైష్ణవి మృదేహాలను సోమవారం సాయంత్రం వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం తల్లి కూతుర్లు మృతదేహాలను బంధువులకు అప్పగించినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు తెలిపారు.

టీటీడీ కల్యాణ మండపం పనులను ప్రారంభించండి

సత్యవేడు, జూలై 15: సత్యవేడులో నిర్మించతలపెట్టిన టీటీడీ కల్యాణ మండపం పనులను ప్రారంభించాలని ఈవో శ్యామల రావును ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. సోమవారం తిరుపతిలోని టీటీడీ కార్యాలయంలో ఈవో శ్యామలరావును, జేఈవో వీరబ్రహ్మంను ఎమ్మెల్యే ఆదిమూలం మర్యాద పూర్వకంగా కలిశారు. సత్యవేడులో మంజూరయిన టీటీడీ కల్యాణ మండపం గురించి వారికి వివరించి, పనులు ప్రారంభించాలని విన్నవించారు. అనంతరం ఎస్పీ సుబ్బారాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు.


టీటీడీ ఈవోను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రభుత్వ కార్యాలయాన్నింటిలో సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు పెట్టండి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 15: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫొటోలు పెట్టాలని టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. సోమవారం వారు పలు కార్యాలయాలను సందర్శించారు. వెలుగు, వ్యవసాయశాఖ, పోలీస్‌స్టేషన్, హౌసింగ్ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫొటోలు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వెలుగు కార్యాలయంలో సీఎం ఫొటో ఓ మూలన ఉంచడాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సిబ్బంది చేత సీఎం ఫొటోను గోడకు ఏర్పాటు చేయించారు. అనంతరం తహసీల్దార్ ఆలీఖాన్‌ను కలిసి మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాయాల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫొటోలు ఉండేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, నాయకులు కన్నయ్య నాయుడు, సుందరయ్య, మధునాయుడు, చెంచురామ నాయుడు, వీరరాఘవులు, పెంచలయ్య, మునిబాబు, మునిరాజ, శ్రీనివాసులు, శేషయ్య భాస్కర్ యాదవ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నతి

శ్రీకాళహస్తి, జూలై 15: విద్యతోనే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు అన్నారు. పట్టణంలోని తెలుగుగంగ కాలనీలో ఉన్న సరస్వతీ బాయ్ ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరంలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సుబ్బమ్మ, మోహనరావు ఫౌండేషన్ ద్వారా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న బొజ్జల రిషితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా గురుదేవ్

వరదయ్యపాళెం, జూలై 15: వరదయ్యపాళెం మండలానికి చెందిన కేబీ గురుదేవ్ బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడుగా నియమితులయ్యారు. సోమవారం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప నియామక ఉత్తర్వులు జారీ చేశారు. గురుదేవ్ మాట్లాడుతూ తనను జిల్లా కార్యవర్గ సభ్యుడుగా నియమించిన చంద్రప్పకు కృతజ్ఞతలు తెలిపారు.



కల్వర్టు పనులు ప్రారంభం

శ్రీకాళహస్తి, జూలై 15: శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి పంచాయతీలో కల్వర్టు పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. మురుగు కాలువలు పూడిపోయి సిమెంటు పైపులు దెబ్బతినడంతో వాటిని తొలగించారు. కొత్త పైపులతో నిర్మాణ పనులు చేపట్టారు.

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి రిమాండ్

ఏర్పేడు, జూలై 15: ఏర్పేడు మండలంలో వారం రోజుల క్రితం ఆరేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన బలరామయ్యగౌడ్‌ను పోలీసులు ఆదివారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. సోమవారం అతడిని కోర్టులో హాజరుపరచగా 14రోజులు రిమాండ్ విధించారు. దీంతో శ్రీకాళహస్తి సబ్‌జైలుకు తరలించారు.

ఇంట్లో విద్యుత్ పరికరాల చోరీ

శ్రీకాళహస్తి, జూలై 15: నిర్మాణ దశలో ఉన్న ఇంట్లో విద్యుత్ పరికరాలు చోరీ జరిగిన ఘటన ఆదివారం రాత్రి శ్రీకాళహస్తిలో చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన గుల్షాద్ బేగం బుచ్చినాయుడుకండ్రిగ ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ సహాయకురాలిగా పనిచేస్తోంది. దక్షిణ కైలాసగర్‌కాలనీలోని అమరావతి వీధిలో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. ఈమె తన ఇంటికి సమీపంలోనే స్థలం కొనుగోలు చేసి ఇంటి నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం కొద్దిరోజుల క్రితం రూ.1.54 లక్షలతో విద్యుత్ పరికరాలను కొనుగోలు చేసి ఇంట్లో భద్రపరిచారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ పరికరాలను చోరీ చేశారు. గుల్షాద్ బేగం సోమవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, వారం రోజుల క్రితం దక్షిణ కైలాస్‌నగర్‌లో భారీ చోరీ జరిగింది. ఎవరూ లేని ఇంట్లో చొరబడ్డ దొంగలు 329గ్రాముల బంగారు, 900 గ్రాముల వెండి, రూ.3.5లక్షల నగదు ఎత్తుకెళ్లారు. కాలనీలో వరుస చోరీలు జరగడంపై జనం భయాందోళన చెందుతున్నారు.

వీడని ముసురు

సత్యవేడు, జూలై 15: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణితో శుక్రవారం నుంచి మండలంలో వానలు కురుస్తున్నాయి. గత మూడు రోజులుగా కుస్తున్న ముసురు వానలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. ప్రధానంగా సత్యవేడులోని కోటమిట్ట, ఎన్టీఆర్ నగర్, ఓంశక్తి గుడివీధి తదితర ప్రాంతాల్లో వీధులు బురదమయంగా మారాయి. దీంతో ప్రజలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు విడవకుండా కురుస్తున్న వర్షాలకు సజ్జపంట దెబ్బతిందని రైతులు వాపోతున్నారు.

గంగమ్మకు పొంగళ్లు

వరదయ్యపాళెం, జూలై 15: వరదయ్యపాళెం మండలం తొండూరులో సోమవారం గంగమ్మకు పొంగళ్లను పెట్టారు. ఉదయాన్నే ఊరేగింపుగా గంగమ్మ వద్దకు వెళ్లారు. అక్కడ పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా అందించారు.

నగదు అప్పగింత

శ్రీకాళహస్తి, జూలై 15: తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా ఎర్రగట్టుపల్లికి చెందిన శ్రీకాంత్ సోమవారం శ్రీకాళహస్తీశ్వరస్వామి అమ్మవార్లను దర్శించుకున్నాడు. ఈ క్రమంలో ఆయన తన బ్యాగును ఆలయ ప్రాంగణంలో పోగొట్టుకున్నాడు. గుర్తించిన ఎస్పీఎఫ్ సిబ్బంది బ్యాగుతో పాటు అందులో ఉన్న రూ.13వేల నగదు శ్రీకాంత్‌కు అందజేశారు.

ఎంపీడీవోకు సన్మానం


ఎంపీడీవోను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

వరదయ్యపాళెం, జూలై 15: వరదయ్యపాళెం ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన ప్రసాద్‌ను టీడీపీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగరాజు, శేఖర్, సునీల్, మార్కండేయ, రాగయ్య, కిరణ్, నాగయ్య, గణపతి, పరంధామ, చలపతి నాయుడు, పవన్, దశరథన్, మహేష్, గోవిందయ్య, కృష్ణ, బాలయ్య పాల్గొన్నారు.

డయేరియా నిర్మూలనపై అవగాహన

శ్రీకాళహస్తి, జూలై 15: తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాళెం ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులు, తల్లిదండ్రులకు డయేరియా నిర్మూలనపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజరు నాగేంద్ర మాట్లాడుతూ కలుషిత ఆహారం, తాగునీటిని వినియోగించవద్దని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం, ఏఎన్ఎం ఇందిరమ్మ, ఆశా వర్కర్ దుర్గ, అంగన్‌వాడీ కార్యకర్త మోహనరాణి పాల్గొన్నారు.

డిజిటల్ బోధన ఉపయోగకరం

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 15: డిజిటల్ విధానంలో బోధన ద్వారా పాఠ్యాంశాలు విద్యార్థులకు సులభంగా అర్థమవుతాయని ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం అన్నారు. బుచ్చినాయుడుకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ద్వారా జరుగుతున్న బోధనను సోమవారం పరిశీలించారు.

ఆస్పత్రిలో ఆర్వోప్లాంటు ఏర్పాటుకు చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఆస్పత్రి చైర్మన్ ప్రతిమ

సత్యవేడు, జూలై 15: మండలంలోని దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగుల సౌకర్యార్థం ఆర్వో ప్లాంటు ఏర్పాటు చర్యలు తీసుకోనున్నట్లు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ ప్రతిమ పేర్కొన్నారు. సోమవారం ఆస్పత్రి ఆవరణలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ గుణశేఖర్ ఆధ్వర్యంలో కమిటీ సమావేశం జరిగింది. ఆస్పత్రిలో సమస్యలు, చేపట్టాల్సి అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ప్రధానంగ తాగునీటి సమస్య నెలకొందని అధికారులు, డాక్టర్లు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. కొత్తబోరు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరిస్తామని, రోగులకు సురక్షిత తాగునీరు అందించేందుకు ఆర్వోప్లాంటు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చైర్మన్ చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో చంద్రశేఖర్, డాక్టర్ మురళీకృష్ణ, ఎంపీహెచ్ఈవో సుబ్రహ్మణ్యం, సర్పంచులు రవిరెడ్డి, జయంతి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ మీటింగ్‌కు వెళ్లామని నష్టపరిహారాన్ని అడ్డుకున్నారు!

రేణిగుంట, జూలై 15: వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ మీటింగ్‌కు వెళ్లామని తమకు రావల్సిన నష్టపరిహారాన్ని అప్పటి ఎమ్మెల్యే మధు అడ్డుకున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ బీసీ కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం, గీత, భాను మాట్లాడుతూ కడప - రేణిగుంట రోడ్డు విస్తరణలో భాగంగా సర్వే నెంబరు 185/2లో పలువురి ఇళ్ల తొలగించారని తెలిపారు. ఇందులో వైసీపీకి చెందిన వారికి అధిక మొత్తంలో లబ్ధి చేకూర్చారని, 18 కుటుంబాలకు మాత్రం అతి తక్కువ ధరను ఇవ్వాలని చూశారని చెప్పారు. ఈ విషయాన్ని అప్పటి ఎమ్మెల్యే మధు దృష్టికి తీసుకుపోగా న్యాయం చేస్తామని చెబుతూనే.. పరిహారంలో వాటా ఇవ్వాలని అధికారులు చేత అడిగించారని ఆరోపించారు. దీంతో టీడీపీ సమావేశానికి వెళ్లి తమకు జరుగుతున్న అన్యాయం గురించి చెప్పామన్నారు. దీనిపై కక్షతో 18 కుటుంబాలకు రావాల్సిన నష్టపరిహారాన్ని అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని అభ్యర్థించారు.

నీరువాయిలో మినరల్ వాటర్ సరఫరా

పిచ్చాటూరు, జూలై 15: పిచ్చాటూరు మండలంలోని నీరువాయి గ్రామంలో గత ఆరు రోజులుగా డయేరియా ప్రబలడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సర్పంచు సుప్రియ వెంకటేష్ ఆధ్వర్యంలో ఇంటింటికీ మినరల్ వాటర్ సరఫరా చేశారు. సర్పంచుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. తిరుమలై, గ్రామ కార్యదర్శి పురుషోత్తం పాల్గొన్నారు.

పిల్లల పట్ల తలిదండ్రులు జాగ్రత్త వహించాలి

ఏర్పేడు, జూలై 15: పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించి భవిష్యత్తుకు బాటలు వేయాలని ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి సూచించారు. ఏర్పేడు మండలం నాగంపల్లి వద్ద ఉన్న ఎస్‌వోఎస్ బాలల గ్రామంలో పేరెంటింగ్ స్కిల్స్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పిల్లల వయసు ఆధారంగా వారి అభివృద్ధికి ఆచరణాత్మకమైన మార్గదర్శకాలను ఎంచుకోవాలని సూచించారు. అలాగే పిల్లలతో సరైన సంభాషణ వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌వోఎస్ లోకేషన్ ఇన్‌ఛార్జి సత్యనారాయణ, సిబ్బంది మునిరత్నం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోండి

రేణిగుంట, జూలై 15: 15వ ఆర్థిక సంఘం నిధులను దుర్వినియోగం చేసిన అప్పటి ఇన్‌ఛార్జి ఎంపీడీవో హరిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్, ఏఈ పీఆర్ జగన్నాథరెడ్డిపై చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో రేణిగుంట మండల టీడీపీ నాయకుడు దేవేందర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. 2019-24 వరకు రేణిగుంట మండల పరిధిలోని 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3.84కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. అయితే పనులు పూర్తి చేయకుండానే ఖర్చు చూపడం, ఒకపనికి రెండుసార్లు బిల్లులు పెట్టడం ద్వారా రూ.2కోట్ల నిధులను దుర్వినియోగం చేసినట్లు పేర్కొన్నారు. అంతేకాక వైసీపీ ప్రజాప్రతినిధులు వారి సొంత ఖాతాల్లోకి నిధులను మళ్లించడం జరిగిందన్నారు. వీటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలి

శ్రీకాళహస్తి, జూలై 15: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత కోరారు. పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్‌లో నిర్వహిస్తున్న గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం స్కూల్ యాజమాన్యం మొక్కలు నాటడం సంతోషకరమన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినికి 10గ్రాముల వెండి నాణేన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిరోషా, ఉపాధ్యాయులు, జనసేన నాయకుడు కోట చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వినుత

వసతిగృహంలో తనిఖీలు

శ్రీకాళహస్తి, జూలై 15: పట్టణంలోని బీసీ, ఎస్సీ వసతి గృహాలను పురపాలక సంఘ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. పరిశుభ్రత, మంచినీటి వసతులను పరిశీలించారు. అదే విధంగా మంచినీరు, బోరు నీటిని శాంపిల్స్ సేకరించి పరిశీలనకు పంపారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులకు శుచికరమైన ఆహారం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పురపాలక సంఘ అధికారులు లలిత, శ్రీనివాసులు, శ్రీకాంత్, ఉదయ్, సచివాలయ సిబ్బంది చైతన్య పాల్గొన్నారు.


వంటగదిని పరిశీలిస్తున్న అధికారులు

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడం ఏమనగా! నా కక్షిదారు మెస్సర్స్ శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, తిరుపతి బ్రాంచి -1 మేనేజర్ వారు ఇచ్చిన తోగట్టా ప్రకారము ఈ క్రింది కనిన షెడ్యూలు దాఖలా సిరాస్తి తిరుపతి నగరం, మంచాలవీధి, ఇం.నెం.6-3-234లో కాపురముండే లేటె బైరాగి వెంకట్రామయ్య గారి కుమారుడు బి. భూపతి గారికి చెందినదనియు సదరు ఆస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని సదరు బి.భూపతి గారి భార్య బి.లక్ష్మి గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి ఈ క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి అప్పులు, దావాలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 7 దినములలోగా ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియచేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా కక్షిదారు బాధ్యులు కారు.

షెడ్యూలు : 1వ ఐటం - చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్ జిల్లా, తిరుపతి రూరల్ సబ్-డి, తిరుపతి రూరల్ మండలం నెం.14 దుర్గసముద్రం గ్రూప్, చిగురువాడ దక్షిణపు కండ్రిగ గ్రామలెక్కదాఖలా సర్కారు పుంజ సర్వేనెం. 168/2 లో భూమిలో వేసిన లే అవుట్ ప్లాట్లలో ప్లాటు నెం. 7 గల జాగాకు హద్దులు, కొలతలు వివరములు : తూర్పు : ప్లాటు నెం. 8 గల జాగా, పడమర : రాజవీధి, ఉత్తరము : ప్లాటు నెం.6 గల జాగా, దక్షిణము : : 19 అడుగులు వెడల్పు గల లే-అవుట్ రోడ్డు, ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమరకు ఉత్తరము వైపు అ.25-6 లేక మీ.7.777, తూర్పు నుండి పడమరకు దక్షిణము వైపు అ. 26 లేక మీ. 7.930, ఉత్తరము నుండి దక్షిణమునకు తూర్పు వైపు అ. 43 లేక మీ. 13.115, ఉత్తరము నుండి దక్షిణమునకు పడమర వైపు అ. 43 లేక మీ. 13.115, మొత్తం చ.అ. 1096.5 లేక చ.గ. 121.83 లేక 30.45 అంకణములు గల జాగా పూరా. 2వ ఐటం :- చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్ జిల్లా, తిరుపతి రూరల్ సబ్-డి, తిరుపతి రూరల్ మండలం నెం.14 దుర్గసముద్రం గ్రూప్, చిగురువాడ దక్షిణపు కండ్రిగ గ్రామలెక్కదాఖలా సర్వేనెం.168/2లో పూరా విస్తీర్ణం ఎ.1-20 సెంట్లు గల భూమిలో వేసియుండు ప్లాట్లలో ప్లాటు నెం. 8 & 8ఏ గల జాగాకు హద్దులు కొలతలు వివరములు: తూర్పు : ప్లాటు నెం. 9 గల జాగా, పడమర : నీ యొక్క ప్లాటు నెం. 7 గల జాగా, ఉత్తరము : ప్లాటు నెం. 5 & 6 గల జాగా, దక్షిణము : 19 అడుగులు వెడల్పు గల రోడ్డు, ఈ హద్దుల మధ్యన గల తూర్పు నుండి పడమరకు ఉత్తరము వైపు అ. 33 లేక మీ.10.058, తూర్పు నుండి పడమరకు దక్షిణము వైపు అ.32-6 లేక మీ.9.906, ఉత్తరం నుండి దక్షిణమునకు తూర్పు వైపు అ. 40 లేక మీ. 12. 192, ఉత్తరం నుండి దక్షిణమునకు పడమర వైపు అ.36-2 లేక మీ. 11.021, మొత్తం చ.అ. 1238.75 లేక చ.గ. 137.63 లేక 34.25 అంకణములు గల జాగా పూరా. ఈ ఆస్తి అసైన్మెంటు, ప్రభుత్వ, ఎండోమెంటు ఆస్తి కాదు.

జి.వి.సుబ్బయ్య, బి.ఎ.,బి.ఎల్., అడ్వకేట్,
డో.నెం.8-114/2, రాయల్ నగర్, ఆర్.సి.రోడ్డు, తిరుపతి. సెల్ : 94402 02564

పుత్తూరు వార్తలు

మహాశివరాత్రి ఖర్చులపై అనుమానాలున్నాయ్

సదాశివకోన ఆలయ చైర్మన్


సమావేశమైన సదాశివకోన ఆయన బోర్డు సభ్యులు

వడమాలపేట, జూలై 15: సదాశివకోనలో మహాశివరాత్రి ఖర్చులపై అనుమానాలున్నాయని ఆలయ చైర్మన్ జయచంద్రన్ చెప్పారు. 'శివుడి సొమ్మునూ దుర్వినియోగం చేస్తారా' శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం అయింది. దీంతో బోర్డు సభ్యులు సోమవారం పుత్తూరులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ ఆలయ ఈవో రామచంద్రారెడ్డి ఏకపక్షంగా వ్యవహరించారని, బోర్డు సభ్యులకు కూడా ఖర్చుల వివరాలు తెలుపలేదని చెప్పారు. శివరాత్రి తరువాత బోర్డు సభ్యులకు తెలియకుండా హుండీ లెక్కించి రూ.67వేల ఆదాయం వచ్చినట్లుగా వెల్లడించాలని, దీనిపై అనుమానం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మహాశివుడి దర్శనార్థం భక్తుల తాకిడి ఎక్కువైందని, లక్ష రూపాయలకు పైగానే ఆదాయం రావాల్సి ఉందని చెప్పారు. ఇక మహాశివరాత్రి ఖర్చులు భారీ మొత్తంలో చూపారని, గతంలో ఎవరూ ఇంత ఖర్చు పెట్టలేదన్నారు. ఈవో బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి నిబంధనలకు వ్యతిరేకంగా ఏకపక్షంగా వ్యవహరించారని ఆక్షేపించారు. మహాశివరాత్రి రోజున ఈవో సదాశివకోనకే రాలేదన్నారు. దీనిపై బోర్డు సభ్యుల నిర్ణయాలను దేవదాయశాఖ ఉన్నతాధికారులకు పంపుతామని చైర్మన్ చెప్పారు. సమావేశంలో బోర్డు సభ్యులు గోపీ రమణ, వాసుదేవరెడ్డి, కమలమ్మ, వరలక్ష్మి, శేఖర్ పాల్గొన్నారు.

గాలేరు - నగరి పూర్తి చేయడానికి ప్రాధాన్యమివ్వండి

పుత్తూరు అర్బన్, జూలై 15: నగరి నియోజకవర్గంలోని సమస్యలపై ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సోమవారం మంత్రులు, అధికారులతో సమావేశమయ్యారు. అమరావతిలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడును కలిసి చెరువులు, ఒరవ కాలువలు, సప్లై చానల్ సంబంధించి ప్రస్తుత పరిస్థితిని వివరించారు. వీటి మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని మంత్రిని కోరారు. అలాగే నియోజకవర్గానికి జీవనాడి అయిన గాలేరు - నగరి ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రాధాన్యమిచ్చి సాగు, తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. మంత్రి మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే చెరువుల మరమ్మతులకు సంబంధించి నిధుల విడుదల చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్‌ను కలిసిన ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ విజయపురం మండల పరిధిలోని కోసలనగరంలో పారిశ్రామికవాడ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల తమిళనాడు అంబత్తూరు ఇండస్ట్రియలిస్ట్ అసోసియేషన్ తనను కలిసి చర్చించిన విషయాలను ప్రస్తావించారు. అనంతరం పంచాయతీరాజ్ ఈఎన్‌సీ బాలు నాయక్‌ను కలిసి నియోజకవర్గంలో పీఆర్ ఆధ్వర్యంలో ఉన్న రోడ్ల దుస్థితి, అప్రోచ్ రోడ్ల నిర్మాణం ఆవశ్యతను వివరించారు. ఇందుకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై వినతిపత్రం సమర్పించారు.


మంత్రి నిమ్మల రామా నాయుడికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

వినాయకుడికి పూజలు

పుత్తూరు అర్బన్, జూలై 15: పట్టణంలోని గేటు పుత్తూరులో ఉన్న వినాయకుడి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవాలు నిర్వ హిస్తున్నారు. సోమవారం ఉద యం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు నిషిదరాజు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శంకర్, మధు, గోపి, కార్తీక్ పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నారాయణ వనం, జూలై 15: నారాయణ వనం మండల పరిధిలోని పాలమంగళం సమీపంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి చెందింది. ఎస్ఐ కథనం మేరకు.... నాగలాపురం మండలం, నందనం గ్రామానికి చెందిన భానుప్రియ(24) భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై పుత్తూరు నుంచి నాగలాపురం వెళుతుండగా, పాలమంగళం వద్ద బైక్ అదుపుతప్పి పడిపోయింది. వెనుక నుంచి వచ్చిన లారీ భానుప్రియ మీదుగా వెళ్లడంతో అక్కడిక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


భానుప్రియ మృతదేహం